# తొలివెలుగు

జాతీయ దిన పత్రిక

మన భాష.. మన పత్రిక..

https://tholivelugu.com/

హైదరాబాద్ సంపుటి:01 సంచిక: 155 19-6-2026 వెల: రూ.2/- పేజీలు: 06



విలేకరులు కావలెను

తొలివెలుగు జాతీయ దిన పత్రిక మన భాష.. మన పత్రిక..

www.epaper.tholivelugu.com

Contacts

తెలంగాణ

94911 34365


ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో

తొలివెలుగు జాతీయ తెలుగు దినపత్రికలో పలు విభాగాల్లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన స్టేట్ బ్యూరో, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, మండల రిపోర్టర్లు కావలెను. ఆసక్తి.. అనుభవం గల వారు సంప్రదించగలరు.


## 'నాన్–సీరియస్ ప్లేయర్స్'కు

# ఏపీలో చోటులేదు

- రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి సమావేశంలో రూ. 30,515 కోట్ల పెట్టుబడులకు ఆమోదం
- ఈ ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రంలో సుమారు 30 వేల ఉద్యోగాలు రానున్నాయని అంచనా
- పారిశ్రామిక అభివృద్ధి ఫలాలు పేద, మధ్య తరగతికి చేర్చాలని సీఎం చంద్రబాబు ఆదేశం
- ఇథనాల్, సెమీ కండక్టర్ల పరిశ్రమలను ప్రోత్సహించాలని అధికారులకు దిశానిర్దేశం
- ప్రాజెక్టులు ప్రారంభించాకే ప్రోత్సాహకాలు ఇవ్వాలని మంత్రి లోకేశ్ స్పష్టీకరణ



పారిశ్రామిక అభివృద్ధి ఫలాలు రాష్ట్రంలోని పేద, మధ్య తరగతి ప్రజలకు చేరేలా చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. గురువారం సచివాలయంలో ఆయన అధ్యక్షతన జరిగిన 18వ రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (ఎస్ఐపీబీ) సమావేశంలో రూ. 30,515 కోట్ల విలువైన 50 ప్రాజెక్టులకు ఆమోదం తెలిపారు. ఈ కంపెనీల ఏర్పాటు ద్వారా రాష్ట్రంలో 29,677 ఉద్యోగాలు రానున్నాయని అంచనా వేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, పరిశ్రమల స్థాపన కేవలం ధనికులకే సాధ్యమనే భావనను తొలగించి, సామాన్యులు కూడా పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు అనువైన వాతావరణం సృష్టించాలని స్పష్టం

- మిగతా 2వ పేజీలో

# సీబీఐ దర్యాప్తు జరగాలి

- ఈ కేసులో సీఐ ఒక్కడిని బాధ్యుడిగా చేస్తే సరిపోదు
- ఈ నేరంలో విజయవాడ సీపీ, డీజీపీకీ భాగముంది
- ఈ ఘటనకు బాధ్యులైన వారందరిపై మర్డర్ కేసు పెట్టాలి
- కొడుకు కోసం ఆ తల్లి పోలీస్‌స్టేషన్ చుట్టూ తిరిగింది
- ఫొటోకు దండ వేసుకోమని సీఐ హేళన చేశారు
- ఆమె ఇచ్చిన ఫిర్యాదును పోలీసులు చెత్తబుట్టలో పడేశారు
- సాయికృష్ణను చంపేశాక లీడర్ల ద్వారా తల్లితో బేరసారాలు
- తల్లి హైకోర్టును ఆశ్రయించడంతో పోలీసుల్లో భయం

అమరావతి: విజయవాడ కృష్ణలంక పోలీస్ స్టేషన్‌లో లాకప్‌డెత్‌కు గురైన గిగ్ వర్కర్ సాయికృష్ణ కేసులో సీబీఐ దర్యాప్తు జరగాలని, అందుకు బాధ్యులైన వారందరిపై కఠిన చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

- మిగతా 2వ పేజీలో





# ప్రతి గింజా కాదు.. కోటా 'మేరకే'!

- కేంద్ర ప్రభుత్వం తన బాధ్యత నుంచి తప్పించుకోవడానికి ప్రయత్నిస్తోంది
- కేంద్రంపై ఒత్తిడి పెంచేందుకే ఈ నిర్ణయం
- కేబినెట్ భేటీ తర్వాత మంత్రులు ఉత్తమ్, తుమ్మల, సీతక్క వెల్లడి
- ఈ ఏడాది ఏడు రకాల సన్నాలకు మాత్రమే బోనస్
- 30న మధిరలో రైతు సమ్మేళనం సభ.. రైతుభరోసా విడుదల
- ఎల్‌నినో ప్రభావం తీవ్రమవుతోంది.. తొందరపడి విత్తనాలు వేయొద్దు
- 21న నీట్ పరీక్ష రాసే విద్యార్థులకు ఉచిత బస్సు ప్రయాణం

హైదరాబాద్: ఇకపై కేంద్ర ప్రభుత్వం నిర్దేశించే కోటా మేరకే రాష్ట్ర ప్రభుత్వం రైతుల నుంచి పంట ఉత్పత్తులను కొనుగోలు చేయనుంది. ఏటా కేంద్రం ఖరారు చేసే కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ)తో నిర్దేశిత కోటా మేరకే కొనుగోళ్లు జరపాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. గురువారం ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి

- మిగతా 2వ పేజీలో

# ఫ్రాన్స్–భారత్ స్నేహం వర్ధిల్లాలి..

- ఫ్రాన్స్‌లో పర్యటిస్తున్న ప్రధాని మోడీ
- ప్రపంచ దేశాధినేతలతో మోడీ భేటీలు
- భారత్ స్నేహం వర్ధిల్లాలంటూ మాక్రాన్ ఆసక్తికర పోస్ట్

ప్రధాని మోడీ ఫ్రాన్స్‌లో పర్యటిస్తున్నారు. జీ 7 సదస్సులో పాల్గొనేందుకు ఫ్రాన్స్‌కు వెళ్లారు. పర్యటనలో భాగంగా ప్రపంచ దేశాధినేతలతో మోడీ సమావేశం అయ్యారు. ట్రంప్ దగ్గర నుంచి జీ 7 దేశాధినేతలంతో కీలక మంతనాలు చేశారు. ఇక తాజాగా ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్.. భారత్‌ను ఉద్దేశించి హిందీలో కీలక పోస్ట్ చేశారు. ఫ్రాన్స్–భారత్ స్నేహం వర్ధిల్లాలంటూ... ప్రధాని మోడీకి హిందీలో శుభాకాంక్షలు తెలిపారు.

- మిగతా 2వ పేజీలో



# రష్యాపై ఉక్రెయిన్ భారీ డ్రోన్ దాడి..





- మంటల్లో రాజధాని మాస్కో..
- ఆయిల్ రిఫైనరీతో పాటు పలు ప్రాంతాలపై దాడి..

ఉక్రెయిన్ రష్యాపై గురువారం భారీ డ్రోన్ దాడి చేసింది. కనీసం రష్యా ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ కూడా ఈ దాడిని గుర్తించలేకపోయింది. ఈ దాడిలో రష్యాలోని పలు ఆయిల్ రిఫైనరీలు దెబ్బతిన్నాయి. రాజధాని మాస్కోలో ఈ డ్రోన్ దాడి విధ్వంసాన్ని సృష్టించింది. ఆయిల్ రిఫైనరీల నుంచి భారీగా

- మిగతా 2వ పేజీలో

# అనాథ పిల్లలకూ 'తల్లికి వందనం'

- కేజీబీవీ హాస్టళ్లలో విద్యార్థినులందరికీ బంక్ బెడ్లు ఏర్పాటు చేయాలని ఆదేశం
- అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌లలో తెలుగు అకాడమీ పుస్తకాల విక్రయానికి నిర్ణయం
- చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచన



2లో

# మాజీ మంత్రి కారుమూరి కుమారుడికి 14 రోజుల రిమాండ్

- గత వైసీపీ ప్రభుత్వ హయాంలోని లిక్కర్ స్కామ్ కేసులో అరెస్ట్
- సునీల్‌ను అరెస్ట్ చేసి చంచల్‌గూడ జైలుకు తరలించిన ఈడీ
- రూ.28 కోట్ల కిక్‌బ్యాకులు పొందినట్లు ఈడీ ఆరోపణ
- ఈ స్కామ్ వల్ల ప్రభుత్వానికి రూ.195 కోట్ల నష్టం వాటిల్లినట్లు అంచనా



2లో



# పీవీ జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలి

- పిల్లలతో గడిపే ప్రతిక్షణం ఆనందభరితమే
- స్వామిరామానందతీర్థలో జరిగిన కార్యక్రమంలో కేటీఆర్

సనత్‌నగర్ (హైదరాబాద్): మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావు జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విద్యార్థులకు సూచించారు. గురువారం బేగంపేట బ్రాహ్మణవాడిలోని స్వామి రామానందతీర్థ మెమోరియల్ స్కూల్‌ను సందర్శించి ఆయన విద్యార్థులకు నోట్‌బుక్స్, స్కూల్ బ్యాగ్‌లు పంపిణీ చేశారు. అలాగే తలసాని ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ 16 భాషల్లో ప్రావీణ్యం సంపాదించిన పీవీ నరసింహారావు దేశానికి, ప్రపంచానికి ఆదర్శంగా నిలిచారని చెప్పారు.

- మిగతా 2వ పేజీలో



2లో

# నేను జైల్లో ఉన్నప్పుడు.. బీఆర్ఎస్ ను బీజేపీలో విలీనం చేయాలనుకున్నారు

- గులాబీ బాస్‌లపై సంచలన ఆరోపణలు చేసిన కవిత
- తాను జైల్లో ఉన్నప్పుడు కొందరు నేతలు తన వద్దకు వచ్చారన్న కవిత
- బీఆర్ఎస్ ను బీజేపీలో విలీనం చేయాలనే ప్రతిపాదనతో వచ్చారని వెల్లడి
- ఆ ప్రతిపాదనను తాను తీవ్రంగా వ్యతిరేకించానన్న కవిత
- పార్టీ కోసం ప్రాణాలు త్యాగం చేయడానికి కూడా సిద్ధపడ్డానని వెల్లడి

# అతడు బతికి లేడు.. శవాన్ని మాయం చేశారు

- సాయికృష్ణను లాకప్ డెత్ చేశారన్న అంబటి
- తాము దీనిపై రాజకీయాలు చేయడం లేదని వ్యాఖ్య
- సీబీఐ చేత విచారణ జరిపించాలని డిమాండ్



2లో

## పీవీ జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలి

(మొదటి పేజీ తరువాయి)

ఆయన చూపిన మార్గంలో నడుస్తూ విద్యార్థులు జీవితంలో గొప్ప స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. 2023లో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో ప్రారంభించిన సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు. పిల్లలతో గడిపే ప్రతి క్షణం ఆనందాన్ని ఇస్తుందని చెప్పారు. సమాజ భవిష్యత్తును తీర్చిదిద్దే విద్యా ర్థులకు నాణ్యమైన విద్యతో పాటు పోషకాహారం కూడా అందించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. స్వామి రామానందతీర్థ మెమోరియల్ స్కూల్‌కు అవసరమైన అదనపు తరగతి గదులు, ఆధునిక లైబ్రరీ నిర్మాణానికి పూర్తి సహకారం అందిస్తామని కేటీఆర్ హామీనిచ్చారు. విద్యార్థులకు అండగా నిలుస్తూ విద్యాభివృద్ధికి కృషి చేస్తున్న తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను ప్రత్యేకంగా అభినందించారు. పాఠశాల అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తున్న ఎమ్మెల్సీ వాణీదేవి సేవలను ప్రశంసించారు. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల విద్యార్థులకు చేయూత అందించడం సమాజ బాధ్యత అని తల సాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. ట్రస్ట్ కార్యక లాపాలను సమర్థవంతంగా నిర్వహిస్తూ విద్యా సేవలను విస్తరింపజేస్తున్న ఎమ్మెల్సీ వాణీదేవిని ఆయన అభినందించారు. తలసాని ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థుల కోసం స్వచ్ఛందంగా మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. విద్యార్థుల సమగ్ర వికాసానికి నాణ్యమైన విద్యతో పాటు సరైన పోషకాహారం కూడా అవసరమని ఎమ్మెల్సీ వాణీదేవి పేర్కొన్నారు. పిల్లలకు సమతుల్య పోషకాహారం అందించినప్పుడే వారి మేధస్సు వికసిస్తుందన్నారు.

## రష్యాపై ఉక్రెయిన్ భారీ డ్రోన్ దాడి..

(మొదటి పేజీ తరువాయి)

మంటలు ఎగిసిపడుతున్నాయి. విమానాశ్రయం నుంచి విమాన సర్వీసుల్ని నిలిపేశారు. ఒకే వారంలో రెండోసారి ఉక్రెయిన్ రష్యా ఆయిల్ వ్యవస్థల్ని టార్గెట్ చేసింది. రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ చెబుతున్న వివరాల ప్రకారం.. రష్యా వాయు రక్షణ వ్యవస్థలు రాత్రికి రాత్రే వివిధ ప్రాంతాలలో 555 ఉక్రేనియన్ డ్రోన్‌లను కూల్చివేశాయి. వాటిలో సుమారు 200 డ్రోన్‌లు రష్యా రాజధానిని సమీపిస్తుండగా అడ్డుకున్నాయి. అయినప్పటికీ, అనేక డ్రోన్‌లు నగరంపై దాడి చేయగలిగాయి. ఈ డ్రోన్ దాడుల వల్ల సదోవోద్ ప్రాంతం, బెలాయా డాచా వంటి షాపింగ్ కాంప్లెక్స్‌లు, కొన్ని నివాస భవనాలు దెబ్బతిన్నాయి. మాస్కో మేయర్ సెర్గీ సోబ్యానిన్, నగర ఆగ్నేయ శివార్లలో మాస్కో చమురు శుద్ధి కర్మాగారంపై అనేక డ్రోన్లు దాడి చేశాయని వెల్లడించారు. మాస్కోలోని నాలుగు ఎయిర్ పోర్టుల్లో విమాన సర్వీసులు నిలిపేశారు. ఈ దాడితో మాస్కోలోని గాజ్‌ప్రోమ్ నెఫ్ట్ చమురు శుద్ధి కర్మాగారం ధ్వంసమైంది. ఇది రాజధాని మాస్కో ప్రాంతానికి అతిపెద్ద ఇంధన సరఫరా సంస్థ. ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోడిమిర్ జెలెన్స్కీ జీ 7 సమావేశం కోసం ఫ్రాన్స్‌లో ఉన్న సమయంలోనే ఈ భారీ దాడి జరిగింది. జెలెన్స్కీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఫ్రెంచ్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మక్రాన్‌తో చర్చలు జరిపారు. ప్రపంచ నాయకుల నుంచి ఉక్రెయిన్‌కు సాయం అందుతుందనే హామీ లభించిందని జెలెన్స్కీ అన్నారు.

## అతడు బతికి లేడు.. శవాన్ని మాయం చేశారు

ఏపీలో రౌడీ షీటర్ సాయికృష్ణ మిస్సింగ్ కేసుపై రాజకీయ కలకలం రేగింది. ఇప్పటికే ఈ వ్యవహారంలో సీఐ నాగరాజుపై ప్రభుత్వం సస్పెన్షన్ వేటు వేసి విచారణకు ఆదేశించిన సంగతి తెలిసిందే. తాజాగా ఈ ఇష్యూపై వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు ప్రెస్‌మీట్ పెట్టి ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఇది కేవలం మిస్సింగ్ కేసు కాదని, లాకప్ డెత్ చేసి శవాన్ని మాయం చేశారంటూ తీవ్ర ఆరోపణలు గుప్పించారు. సాయికృష్ణ కోసం పోలీసులు వెతుకుతున్నామని చెబుతున్న మాటల్లో వాస్తవం లేదని, అతడు బతికి లేడని అంబటి సంచలన వ్యాఖ్యలు చేశారు. తాము దీనిపై ఎలాంటి రాజకీయాలు చేయడం లేదని, కొడుకు కోసం తల్లడిల్లుతున్న ఒక తల్లి ఆవేదనను మాత్రమే ప్రభుత్వం దృష్టికి తీసుకెళుతున్నామని చెప్పారు. ప్రభుత్వం ఆదేశించిన సీనియర్ ఐపీఎస్ విచారణపై అంబటి నమ్మకం వ్యక్తం చేయలేదు. "గ్యాంగ్ వార్‌లోనే సాయికృష్ణ ఏమైపోయాడో తెలియకుండా పోయాడు" అని పోలీసులు ముందే రాసుకున్న రిపోర్ట్‌నే విచారణలో కూడా ఇస్తారని ఎద్దేవా చేశారు. ఒక వ్యక్తిని హత్య చేయడం మొదటి నేరమైతే.. ఆధారాలు దొరకకుండా డెడ్ బాడీని మాయం చేయడం రెండో నేరమని అంబటి దుయ్యబట్టారు. ఈ కృష్ణలంక పీఎస్ ఉదంతంపై పూర్తి నిజాలు బయటకు రావాలంటే తక్షణమే సీబీఐ విచారణ జరిపించాలని, అలాగే విజయవాడ పోలీస్ కమిషనర్‌ను సస్పెండ్ చేసి బాధ్యులందరినీ కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

## అనాథ పిల్లలకూ 'తల్లికి వందనం'

రాష్ట్ర విద్యా వ్యవస్థలో సమూల మార్పులకు శ్రీకారం చుడుతూ ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖల మంత్రి నారా లోకేశ్ అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల ఆధునీకరణ కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎంశ్రీ పథకం నిధుల వినియోగంలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే ప్రథమ స్థానంలో నిలవడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఉండవల్లిలోని తన నివాసంలో విద్యాశాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన సుదీర్ఘ సమీక్షలో ఈ ఘనత సాధించిన అధికారులను అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సంక్షేమం, అభ్యసన సామర్థ్యాల పెంపు, మౌలిక వసతుల కల్పనపై పలు ముఖ్యమైన నిర్ణయాలు తీసుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా కడప మోడల్‌ను స్ఫూర్తిగా తీసుకుని ఈ ఏడాది 844 స్మార్ట్ కిచెన్ల నిర్మాణానికి తక్షణమే చర్యలు చేపట్టాలని మంత్రి లోకేశ్ అధికారులను ఆదేశించారు. ఇప్పటికే ప్రారంభమైన 'సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర' కిట్ల పంపిణీని మెగా పేరెంట్-టీచర్ మీటింగ్ (పీటీఎం) నాటికి పూర్తి చేయాలని స్పష్టం చేశారు. అదేవిధంగా, రాష్ట్రంలోని 430 కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో (కేజీబీవీ) చదువుకుంటున్న 1,06,360 మంది విద్యార్థినులకు సౌకర్యవంతమైన వసతి కల్పించేందుకు 53,180 బంక్ బెడ్లను వెంటనే ఏర్పాటు చేయాలన్నారు. ఈ సదుపాయాన్ని ఏపీ రెసిడెన్షియల్ స్కూల్స్, కాలేజీలకు కూడా విస్తరించాలని సూచించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోని 2,03,430 మంది విద్యార్థులకు కూడా కిట్లు పంపిణీ చేస్తున్నట్లు అధికారులు మంత్రికి వివరించారు. తల్లిదండ్రులు లేని అనాథ పిల్లలకు సైతం ప్రభుత్వ పథకాల ఫలాలు అందాలన్న లక్ష్యంతో మంత్రి లోకేశ్ కీలక నిర్ణయం తీసుకున్నారు. 'తల్లికి వందనం' పథకాన్ని అనాథ పిల్లలకు కూడా వర్తింపజేయాలని, ఇందుకోసం వారి గార్డియన్ల వివరాలను కచ్చితత్వంతో సేకరించాలని ఆదేశించారు. ఒకవేళ ఎవరూ లేని పక్షంలో, ఆ నిధులను నేరుగా జిల్లా కలెక్టర్‌కు పంపి, వారి ద్వారా పిల్లలకు చేరేలా చూడాలన్నారు. అంతేకాకుండా, అనాథ పిల్లల పేరుపై బ్యాంకు ఖాతాలు తెరిచి, పథకం నిధులను నేరుగా జమ చేయాలని సూచించారు. వారి చదువు పూర్తయ్యాక ఆ మొత్తాన్ని వారు స్వేచ్ఛగా వినియోగించుకునేలా ఒక శాశ్వత విధానాన్ని రూపొందించాలని దిశానిర్దేశం చేశారు.

# 'నాన్-సీరియస్ ప్లేయర్స్'కు ఏపీలో చోటులేదు

(మొదటి పేజీ తరువాయి)

చేశారు. ఈ సమావేశంలో చంద్రబాబు మాట్లాడుతూ, "రాష్ట్రంలో పెద్ద ఎత్తున పారిశ్రామికాభివృద్ధి జరుగుతోంది. ఈ ఫలాలు పేద, మధ్య తరగతికి ఉద్యోగాల రూపంలోనే కాకుండా, వారు కూడా కంపెనీలు స్థాపించేలా ప్రోత్సహించాలి. స్టార్టప్‌లకు పెద్దపీట వేయాలి. దీనికోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆర్టీఐహెచ్ (ఆర్టీఐహెచ్) సేవలను పూర్తిస్థాయిలో వినియోగించుకుని, వెంచర్ క్యాపిటలిస్టుల నుంచి పెట్టుబడులు ఆకర్షించాలి" అని దిశానిర్దేశం చేశారు. ప్రాజెక్టులకు అనుమతులు పొందాక వెంటనే పనులు ప్రారంభించని సంస్థల విషయంలో కఠినంగా వ్యవహరించాలని, 'నాన్-సీరియస్ ప్లేయర్స్'కు ఏపీలో చోటులేదని హెచ్చరించారు. ఇథనాల్ ఆధారిత ఇంధన వినియోగాన్ని ప్రోత్సహించాలని, దీనివల్ల రైతులకు ప్రయోజనం చేకూరడంతో పాటు ఇంధన దిగుమతుల భారం తగ్గుతుందని సీఎం అన్నారు. 40 శాతం ఇథనాల్ బ్లెండింగ్‌కు కేంద్రం అంగీకరించిన నేపథ్యంలో ఇథనాల్ తయారీ పరిశ్రమలను ప్రోత్సహించాలని సూచించారు. అదేవిధంగా, సెమీ కండక్టర్ల తయారీకి అవసరమైన ఎకోసిస్టమ్‌పై ప్రత్యేకంగా దృష్టి సారించాలని, లిథియం అయాన్, ఫాస్ట్ ఛార్జింగ్ బ్యాటరీల ఉత్పత్తిని ప్రోత్సహించాలని ఆదేశించారు. రైతుల కోసం ప్రత్యేకంగా మైక్రో ఇరిగేషన్ ఎక్విప్‌మెంట్ పార్క్ ఏర్పాటు చేయాలని, దీనివల్ల రైతులకు తక్కువ ధరకే పరికరాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు.

**పర్యాటకం, మౌలిక వసతులపై దృష్టి**

రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని బలోపేతం చేసేందుకు టెంపుల్ టూరిజం, బీచ్ టూరిజం అభివృద్ధి చేయాలన్నారు. సూర్యలంక బీచ్‌కు మాస్టర్ ప్లాన్ తయారు చేయాలని, హార్సిలీ హిల్స్‌లో మంచి రిసార్టులు ఏర్పాటు చేయాలని సూచించారు. పురాతన స్వర్ణగిరిగా పేరున్న జొన్నగిరి గోల్డ్ మైన్ ఉత్పత్తిని వేగవంతం చేయాలన్నారు. పారిశ్రామిక ప్రాంతాల వద్ద కార్మికులకు అందుబాటు ధరల్లో గృహ నిర్మాణాలు చేపట్టాలని, ప్రాజెక్టుల అనుమతుల ప్రక్రియను ఆటోమేషన్ చేసి రాజకీయ జోక్యాన్ని తగ్గించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. పుట్టపర్తిలో 5వ తరం ఫైటర్ జెట్ తయారీ కేంద్రాన్ని వేగంగా పూర్తి చేయాలని, బెంగళూరు-పుట్టపర్తిని ఏరోస్పేస్, డిఫెన్స్ కారిడార్‌గా మార్చాలని ఆదేశించారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి నారా లోకేశ్ కీలక సూచనలు చేశారు. భూ కేటాయింపులు పొందిన కంపెనీలు ప్రాజెక్టులను ప్రారంభించిన తర్వాతే ప్రోత్సాహకాలు, రాయితీలు అమలు చేయాలని స్పష్టం చేశారు. "ప్రాజెక్టులు వేగంగా ప్రారంభమైతేనే జీఎస్టీ రూపంలో రాష్ట్రానికి ఆదాయం వస్తుంది. అప్పుడు ప్రోత్సాహకాలు ఇవ్వడం సమంజసంగా ఉంటుంది" అని అభిప్రాయపడ్డారు. స్థానిక పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ఐటీఐ, పాలిటెక్నిక్ విద్యార్థులకు నైపుణ్య శిక్షణ ఇస్తున్నామని, ఆంధ్రా యూనివర్సిటీలో రేర్ ఎర్త్ మినరల్స్‌పై సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. ఈ సమావేశంలో మంత్రులు అచ్చెన్నాయుడు, పయ్యావుల కేశవ్, టీజీ భరత్, బీసీ జనార్దన్ రెడ్డి, కందుల దుర్గేష్, అనగాని సత్యప్రసాద్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరభ్ కుమార్ ప్రసాద్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## సీబీఐ దర్యాప్తు జరగాలి

(మొదటి పేజీ తరువాయి)

డిమాండ్ చేశారు. ఈ కేసులో విజయవాడ కమిషనర్‌తో పాటు, రాష్ట్ర డీజీపీకి కూడా ప్రమేయం ఉందన్నారు. కేవలం కంటి తుడుపుగా సీఐని సస్పెండ్ చేశారని, విజయవాడ సీపీ, డీజీపీతో సహా బాధ్యులందరిపై మర్డర్ కేసు పెట్టి శిక్షించాలని తేల్చి చెప్పారు. విజయవాడ కృష్ణలంక పోలీస్ స్టేషన్‌లో లాకప్‌డెత్‌కు గురైన గాదె సాయికృష్ణ తల్లి, కుటుంబ సభ్యులను గురువారం ఆయన పరామర్శించారు. కృష్ణలంకలో ఉంటున్న వారి ఇంటికి వెళ్లి జరిగిన దారుణం గురించి పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన అక్కడే మీడియాతో మాట్లాడారు. విజయవాడ నడిబొడ్డున, అంటే రాష్ట్రానికి రాజధాని ప్రాంతం. ఇక్కడి నుంచి కూతవేటు దూరంలోనే ముఖ్యమంత్రి నివాసం. ఇక్కడి నుంచి కూతవేటు దూరంలోనే డీజీపీ కార్యాలయం. విజయవాడలోనే కమిషనరేట్ కూడా ఉంది. ఇక్కడే ఏసీపీ పరిధి. ఇదే పరిధిలోనే కృష్ణలంక పోలీసు స్టేషన్ ఉంది. ఇదే పోలీసు స్టేషన్ పరిధిలోనే ఈ తల్లి (జగన్ పక్కనే ఉన్న సాయికృష్ణ తల్లి) ఎంత దారుణంగా ఈ ఘటన జరిగిందో చెబుతూ రోదిస్తున్న దృశ్యం కనిపిస్తోంది. ప్రతి ఒక్కరినీ ఒకటే ఆలోచన చేయమని అడుగుతున్నా. చంద్రబాబు నాయుడు దగ్గరుండి ప్రోత్సహిస్తున్న కొంత మంది పోలీసులు, వీరు చేసే పనుల వల్ల ఈ రాష్ట్రంలో ఏదైనా అన్యాయం జరిగితే పోలీసు స్టేషన్‌కు వెళ్లడానికి భయపడే పరిస్థితి నెలకొంది. అలా ఈ రాష్ట్రంలో పరిపాలన సాగుతోంది. అందరూ కూడబలుక్కుని ఒకరినొకరు ఎలా వెనకేసుకు వస్తున్నారో చెప్పడానికి ఇదే నిదర్శనం. 'పోలీసులు చెబుతున్నట్లు నా కొడుకు దోపిడీలు, దొంగతనాలు చేసి కోట్లు గడిస్తే, ఒక గిగ్ వర్కర్‌గా ఎందుకు పని చేస్తాడు బాబూ..' అని ఆ తల్లి తన గోడు వెళ్లబోసుకుంది. ఆ కుటుంబం పరిస్థితి అంత దారుణంగా ఉంది. అన్న పోలీసులు ఆ రోజు (మే 9) నుంచే సాయికృష్ణ తల్లి పోలీసుస్టేషన్ చుట్టూ తిరిగితే, 'నీ కొడుకు ఫొటోకు దండ వేసుకో..' అంటూ ఈ తల్లిని సీఐ హేళనగా మాట్లాడారు.

## నేను జైల్లో ఉన్నప్పుడు..
## బీఆర్ఎస్ ను బీజేపీలో విలీనం చేయాలనుకున్నారు

తెలంగాణ రాజకీయాల్లో మరోసారి ప్రకంపనలు మొదలయ్యాయి. ఇటీవల బీఆర్ఎస్‌తో తెగదెంపులు చేసుకుని, సొంతంగా తెలంగాణ రక్షణ సేన పేరుతో పార్టీని ఏర్పాటు చేసిన కల్వకుంట్ల కవిత.. గులాబీ బాస్‌లపై సంచలన ఆరోపణలు చేశారు. ఒక ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ.. ప్రస్తుతం బీఆర్ఎస్ అనే పార్టీ మనుగడలో ఉందంటే దానికి కారణం తానేనని స్పష్టం చేశారు. తాను ఢిల్లీ లిక్కర్ కేసులో జైల్లో ఉన్న సమయంలో.. బీఆర్ఎస్ పార్టీని తీసుకెళ్లి బీజేపీలో విలీనం చేయాలనే ప్రతిపాదనతో కొంతమంది నేతలు తన వద్దకు వచ్చారని కవిత వెల్లడించారు. ఆ ప్రతిపాదన వినగానే తాను తీవ్రంగా వ్యతిరేకించానని, విలీనానికి అస్సలు ఒప్పుకోకుండా స్ట్రాంగ్‌గా నిలబడ్డానని కవిత చెప్పారు.

## ఫ్రాన్స్-భారత్ స్నేహం వర్ధిల్లాలి..

(మొదటి పేజీ తరువాయి)

ఫ్రాన్స్-భారతదేశం మధ్య ఉన్న స్నేహబంధం మరింత బలపడాలని ఆకాంక్షిస్తూ మాక్రాన్ హిందీలో ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేశారు. ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక, ఆర్థిక, సాంకేతిక రంగాల్లో సహకారం మరింత విస్తరించాలనే సందేశాన్ని ఈ సందర్భంగా వ్యక్తం చేశారు. ఫ్రాన్స్ పర్యటనలో ఉన్న ప్రధాని మోడీకి ఘన స్వాగతం లభించింది. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు, ప్రతినిధులు భారత ప్రధానికి హిందీలో అభినందనలు తెలియజేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. భారత్-ఫ్రాన్స్ సంబంధాలు గత కొన్ని సంవత్సరాలుగా మరింత బలోపేతమవుతున్నాయి. రక్షణ, అంతరిక్షం, సాంకేతికత, వాణిజ్యం, విద్య, ఆవిష్కరణల వంటి అనేక రంగాల్లో ఇరు దేశాలు కలిసి పనిచేస్తున్నాయి. ఇటీవల ప్రారంభమైన 'ఇండియా-ఫ్రాన్స్ ఇయర్ ఆఫ్ ఇన్నోవేషన్' కార్యక్రమం కూడా ఈ భాగస్వామ్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్తోంది. ప్రధాని మోడీ ఫ్రాన్స్ పర్యటన సందర్భంగా వివాటెక్ (ఎఱఙఖువఎష్ట్ర) వంటి అంతర్జాతీయ సాంకేతిక వేదికల్లో పాల్గొని భారత్‌లోని ఆవిష్కరణలు, స్టార్టప్ వ్యవస్థ సామర్థ్యాలను ప్రపంచానికి పరిచయం చేశారు. ఈ నేపథ్యంలో ఫ్రాన్స్ నుంచి వచ్చిన స్నేహపూర్వక శు భాకాంక్షలు ఇరు దేశాల మధ్య ఉన్న విశ్వాసం, స్నేహానికి నిదర్శనంగా నిలిచాయి. భారత్-ఫ్రాన్స్ స్నేహబంధం భవిష్యత్తులో మరింత బలపడుతూ ప్రపంచ వేదికపై కీలక భాగస్వామ్యంగా కొనసాగుతుందనే ఆశాభావం వ్యక్తమవుతోంది.

## మాజీ మంత్రి కారుమూరి కుమారుడికి 14 రోజుల రిమాండ్

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన మద్యం రవాణా కుంభకోణం కేసులో మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు కుమారుడు కారుమూరి సునీల్ కుమార్‌కు హైదరాబాద్‌లోని నాంపల్లి కోర్టు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. కోర్టు ఆదేశాల అనంతరం అధికారులు ఆయన్ను చంచల్‌గూడ కేంద్ర కారాగారానికి తరలించారు. జూన్ 18న సునీల్ నివాసం, కార్యాలయాల్లో సోదాలు నిర్వహించిన అనంతరం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు ఆయన్ను అరెస్ట్ చేశారు. తన తండ్రి పౌరసరఫరాల శాఖ మంత్రిగా ఉన్న సమయంలో ఆ పలుకుబడిని ఉపయోగించి మద్యం రవాణా కాంట్రాక్టుల ద్వారా సునీల్ భారీగా లబ్ధి పొందారని, తద్వారా మనీ లాండరింగ్‌కు పాల్పడ్డారని ఈడీ ఆరోపిస్తోంది. విచారణ సందర్భంగా, సుదర్శన్ కన్‌స్ట్రక్షన్స్‌కు చెందిన సందీప్, ప్రతాప్ రెడ్డిలతో సంబంధం ఉన్న సంస్థలకు కాంట్రాక్టులు అప్పగించడంలో భారీ అవకతవకలు జరిగాయని ఈడీ తరపు న్యాయవాది కోర్టుకు వివరించారు. ఈ వ్యవహారంలో సునీల్ సుమారు రూ.28 కోట్ల మేర కిక్‌బ్యాకులు అందుకున్నారని, మరో రూ.7 కోట్ల విలువైన కుటుంబ లావాదేవీలను గుర్తించామని తెలిపారు. ఈ కుంభకోణం కారణంగా ప్రభుత్వ ఖజానాకు దాదాపు రూ.195 కోట్ల నష్టం వాటిల్లిందని ఈడీ అభియోగాలు మోపింది.

# ప్రతి గింజా కాదు.. 'కోటా మేరకే'!

(మొదటి పేజీ తరువాయి)

అధ్యక్షతన రాష్ట్ర సచివాలయంలో జరిగిన అనధికార మంత్రివర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. అనంతరం రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి.. సహచర మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, సీతక్కతో కలిసి విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా.. రైతులు పండించిన ప్రతి గింజను కొంటామని ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం చెప్పిన విషయం విలేకరులు ప్రస్తావించగా.. పంట ఉత్పత్తులను విదేశాలకు ఎగుమతి చేసే యంత్రాంగం రాష్ట్ర ప్రభుత్వం వద్ద ఉండదని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు బదులిచ్చారు. మిర్చి, పత్తి, ఇతర పంటల ఎగుమతి కేంద్రం వల్లే సాధ్యమని స్పష్టం చేశారు. ఇందుకోసమే గతంలో కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎఫ్‌సీఐ, సీసీఐ, నాఫెడ్ సంస్థలను నెలకొల్పిందని గుర్తు చేశారు. పంటల కొనుగోలు బాధ్యతల నుంచి తప్పుకోవడానికి కేంద్రం ప్రయత్నిస్తుండడంతో ఒత్తిడి పెంచడానికే ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. రాష్ట్రంలో పండించే అన్ని రకాల పంటలను ఎంఎస్‌పీతో పూర్తిగా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఎల్‌నినో ప్రభావం తీవ్రమవుతోందని, ప్రధానంగా తెలంగాణ, ఏపీపైనే అధిక ప్రభావం ఉండబోతోందంటూ వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిందని తుమ్మల చెప్పారు. తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొనే అవకాశం ఉందని, కాబట్టి మొదటి వర్షం పడగానే తొందరపాటుతో విత్తనాలు నాటవద్దని రైతులకు సూచించారు. కనీసం 7 సెం.మీ.ల వర్షం కురిస్తేనే విత్తనాలు మొలకెత్తేందుకు సరిపడ తేమ లభిస్తుందని చెప్పారు. మండల వ్యవసాయ అధికారులు చేసే సూచనలను రైతులు పాటించాలని కోరారు. సన్న ధాన్యానికి రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తున్న బోనస్‌ను ఈ ఏడాది ఏడు రకాల సన్నాలకు మాత్రమే ఇవ్వాలని మంత్రుల సమావేశం నిర్ణయించింది. బీపీటీ--5204, ఆర్ఎన్ఆర్--15048,హెచ్ఎంటీ సోనా, జై శ్రీరామ్, కేఎన్ఎం--1638, డబ్ల్యూజీఎల్--44, కేఎన్ఎం--7715.. ఈ ఏడు రకాల సన్నాలకు మాత్రమే బోనస్ వర్తిస్తుంది. రాష్ట్రంలో సన్నాలు పండించే 83 శాతం రైతులు ఈ రకాలనే పండిస్తున్నారని తుమ్మల చెప్పారు. మార్కెట్ డిమాండ్, ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. వీటిని పండిస్తే ప్రభుత్వం కొనుగోలు చేయకపోయినా రైతులు మార్కెట్లో విక్రయించుకోవచ్చని అన్నారు.

**రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోళ్లు**

గతంలో ఎన్నడూ లేని విధంగా యాసంగిలో రాష్ట్ర ప్రభుత్వం రికార్డు స్థాయిలో ఇప్పటికే దాదాపు 80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసిందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మిగతా రాష్ట్రాలతో పోలిస్తే కేంద్రం మన రాష్ట్రం నుంచి తక్కువ ధాన్యాన్ని సేకరించటంపై కేబినెట్ ఆందోళన వ్యక్తం చేసిందని చెప్పారు. ఖమ్మం జిల్లా మధిరలో ఈ నెల 30న భారీ స్థాయిలో రైతు సమ్మేళనం సభ ఏర్పాటు చేసి ఆ వేదిక నుంచి వానాకాలం పంటల సాగుకు పెట్టుబడి సాయంగా రైతు భరోసా నిధులు పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు వెల్లడించారు. వానాకాలం సీజన్‌కు రాష్ట్రానికి కేటాయించిన ఎరువుల కోటాను వెంటనే విడుదల చేయాల్సిందిగా కేంద్రానికి మళ్లీ విజ్ఞప్తి చేయాలని నిర్ణయించినట్టు ఉత్తమ్ తెలిపారు. ఇందుకోసం త్వరలో ఇతర మంత్రులతో కలిసి ఢిల్లీ వెళతామని తుమ్మల చెప్పారు. గత ఏప్రిల్, మే నెలల్లో 2 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా రాష్ట్రానికి కేటాయించి, లక్ష మెట్రిక్ టన్నులు కూడా విడుదల చేయలేదని విమర్శించారు. రామగుండం ఫ్యాక్టరీలో ఉత్పత్తి అవుతున్న ఎరువులను మధ్యప్రదేశ్, బిహార్‌కు తరలిస్తున్నారని, ఇకపై అధ్యధిక కోటాను రాష్ట్రానికే కేటాయించాలని డిమాండ్ చేశారు. 'మెట్రో రైలు రెండో దశ విస్తరణకు అవసరమైన అనుమతులు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వానికి మంత్రివర్గం విజ్ఞప్తి చేస్తోంది. ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఆర్ఎఫ్‌సీ) నుంచి ఒప్పందం ప్రకారం రావాల్సిన రుణాన్ని వెంటనే మంజూరు చేయించాలని కోరుతున్నాం. రాష్ట్రం నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్న కేంద్ర మంత్రులు, బీజేపీ ఎంపీలందరూ మెట్రో విస్తరణకు సహకరించాలి..' అని ఉత్తమ్ కోరారు. ఈ నెల 21న రాష్ట్రంలోని 2,008 పరీక్ష కేంద్రాల్లో జరగనున్న నీట్ పరీక్షకు 2.95 లక్షల మంది విద్యార్థులు హాజరు కానున్నారని, ఈ విద్యార్థులందరికీ (హాల్ టికెట్లు చూపాలి) ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించాలని నిర్ణయించినట్టు మంత్రి తెలిపారు.

# మరిపెడ ఉపాధి హామీ అధికారులు ఇద్దరు సస్పెండ్

- నిధుల దుర్వినియోగం ఆరోపణలపై విచారణ
- ఉత్తర్వులు జారీ చేసిన డీఆర్డీఓ పీడీ

**తొలివెలుగు, మరిపెడ:** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎన్ఆర్ఈజీఎస్) నిధుల దుర్వినియోగం ఆరోపణల నేపథ్యంలో మరిపెడ మండలంలో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు అధికారులపై సస్పెన్షన్ వేటు పడింది. మరిపెడ ఏపీఓ (అసిస్టెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్) భీమా నాయక్, ఇన్‌ఛార్జ్ ఈసీ (ఇంజనీరింగ్ కన్సల్టెంట్) భూక్యా నెహ్రూ నాయక్‌లను సస్పెండ్ చేస్తూ జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్డీఓ) ప్రాజెక్ట్ డైరెక్టర్ (పీడీ) మధుసూదన్ రాజు ఉత్తర్వులు జారీ చేశారు. వీరిద్దరూ నిధుల మళ్లింపునకు పాల్పడినట్లు వచ్చిన ఆర్థిక ఆరోపణలపై ఉన్నతాధికారులు ప్రాథమిక విచారణ చేపట్టారు. ఈ విచారణలో అక్రమాలు జరిగినట్లు తేలడంతో క్రమశిక్షణా చర్యల్లో భాగంగా పీడీ వీరిని సస్పెండ్ చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం, నిధుల దుర్వినియోగానికి పాల్పడితే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని అధికారులు స్పష్టం చేశారు.

## మరిపెడ కార్గిల్ సెంటర్‌లో పోలీసుల ఆకస్మిక తనిఖీలు

- పాన్ షాపుల్లో నిషేధిత గుట్కా, ఖైనీ కోసం శోధన
- చట్టవిరుద్ధ విక్రయాలపై కఠిన చర్యలు: ఎస్ఐ సతీష్




**తొలివెలుగు, మరిపెడ:** మరిపెడ పట్టణ కేంద్రంలోని ప్రముఖ కూడలి అయిన కార్గిల్ సెంటర్ వద్ద గల పలు పాన్ షాపులపై పోలీసులు గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మరిపెడ సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్ఐ) పి. సతీష్ నేతృత్వంలోని పోలీస్ బృందం ఈ దాడుల్లో పాల్గొంది. మార్కెట్లో నిషేధిత గుట్కా, ఖైనీ, ఇతర మత్తు పదార్థాల విక్రయాలు సాగుతున్నాయన్న సమాచారంతో దుకాణాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఐ సతీష్ మాట్లాడుతూ.. ప్రభుత్వ నియమ నిబంధనలకు విరుద్ధంగా, చట్టవ్యతిరేకంగా నిషేధిత వస్తువులను విక్రయిస్తే వ్యాపారులపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజల, ముఖ్యంగా యువత ఆరోగ్యానికి తీవ్ర హాని కలిగించే ఇటువంటి పదార్థాల అమ్మకాలను ఎట్టిపరిస్థితుల్లోనూ సహించేది లేదన్నారు. పట్టణంలో గుట్కా, ఖైనీ నిర్మూలన ధ్యేయంగా ఇటువంటి ఆకస్మిక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని స్పష్టం చేశారు.

## విద్యుత్ ప్రమాద బాధిత కుటుంబానికి రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా

- చెక్కు అందజేసిన ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య
- బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా

**తొలివెలుగు, రాజాపేట:** మండల కేంద్రంలో ఇటీవల జరిగిన విద్యుత్ ప్రమాదంలో మృతి చెందిన సంపంగి అండాలు కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా చెక్కును ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య గురువారం అందజేశారు. రాజాపేటలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులతో కలిసి బాధిత కుటుంబ సభ్యులకు పరిహార చెక్కును ఆయన అందించారు. ఈ సందర్భంగా బీర్ల ఐలయ్య మాట్లాడుతూ.. విద్యుత్ ప్రమాదంలో సంపంగి అండాలు మృతి చెందడం అత్యంత విషాదకరమని అన్నారు. కుటుంబానికి కలిగిన నష్టం ఎట్టి పరిస్థితుల్లోనూ భర్తీ చేయలేనిదేనని, అయితే వారి ఆర్థిక ఇబ్బందులను కొంతవరకు తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి రూ.5 లక్షల పరిహారాన్ని మంజూరు చేసిందని తెలిపారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని, నిరుపేదలు, కార్మికులు, రైతాంగానికి ఎల్లప్పుడూ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ ప్రమాదాలు పునరావృతం కాకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలు, స్తంభాల సమస్యలను వెంటనే పరిష్కరించాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ చంద్రశేఖర్, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తుందని నాయకులు భరోసా కల్పించారు.



# క్యాన్సర్ చికిత్సలో సరికొత్త మైలురాయి

- దేశంలోనే తొలిసారి 'యశోద'లో హైపర్ సైట్ రేడియేషన్ టెక్నాలజీ
- ఆరోగ్యకరమైన కణాలకు నష్టం లేకుండా చికిత్స
- ముందస్తు గుర్తింపుతోనే వ్యాధి నయం: క్యాన్సర్ నిపుణురాలు డా. టి. స్రవంతి




**తొలివెలుగు, యాదాద్రిభువనగిరి:** క్యాన్సర్ మహమ్మారిపై పోరాటంలో దేశీయ వైద్య రంగం సరికొత్త విప్లవానికి వేదికైంది. సికింద్రాబాద్‌లోని ప్రముఖ కార్పొరేట్ వైద్యశాల 'యశోద ఆసుపత్రి' దేశంలోనే మొట్టమొదటిసారిగా అత్యంత అధునాతనమైన 'హైపర్ సైట్' రేడియేషన్ సాంకేతికతను అందుబాటులోకి తెచ్చింది. తద్వారా సామాన్యులకు సైతం ప్రపంచస్థాయి నాణ్యమైన వైద్య సేవలను అందిస్తూ సరికొత్త రికార్డు సృష్టించింది. యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని సంకల్ప హోటల్‌లో గురువారం 'క్యాన్సర్ వ్యాధి – నివారణ, ప్రపంచస్థాయిలో వస్తున్న మార్పులు' అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా యశోద ఆసుపత్రి ప్రముఖ క్యాన్సర్ నిపుణులు డాక్టర్ టి. స్రవంతి మాట్లాడుతూ.. 'హైపర్ సైట్' సాంకేతికత వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిందని హర్షం వ్యక్తం చేశారు. సాధారణంగా క్యాన్సర్ అనగానే రోగులు తీవ్ర భయాందోళనలకు గురవుతుంటారని, అయితే ప్రాథమిక దశలోనే వ్యాధిని గుర్తిస్తే సంపూర్ణంగా నయం చేయవచ్చని ఆమె స్పష్టం చేశారు. ఈ సరికొత్త విధానం బ్రెస్ట్, లంగ్, ప్రొస్టేట్, గ్యాస్ట్రోఇంటెస్టైనల్‌తో పాటు తల, మెడ భాగాలలో వచ్చే వివిధ రకాల క్యాన్సర్‌లకు అద్భుతంగా పనిచేస్తుందని ఆమె వివరించారు. ఈ చికిత్స వల్ల రోగులు ఆసుపత్రిలో గడపాల్సిన సమయం తగ్గడంతో పాటు రేడియేషన్ తాలూకు దుష్ప్రభావాలు (సైడ్ ఎఫెక్ట్స్) కూడా చాలా తక్కువగా ఉంటాయని పేర్కొన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలు, అత్యాధునిక మౌలిక వసతులు కలిగిన యశోద ఆసుపత్రిలో ఈ టెక్నాలజీ అందుబాటులోకి రావడం దేశానికే గర్వకారణమన్నారు. క్యాన్సర్ రోగులు అధైర్యపడకుండా వ్యాధిపై పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యశోద ఆసుపత్రి జనరల్ మేనేజర్ కె. సుదర్శన్ రెడ్డి, సీనియర్ మేనేజర్ ఎం. వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

**చికిత్సలో ఖచ్చితత్వం.. దుష్ప్రభావాలకు చెక్:**

"కొత్తగా అందుబాటులోకి వచ్చిన 'హైపర్ సైట్' టెక్నాలజీ ద్వారా క్యాన్సర్ కణితుల (ట్యూమర్స్) పరిమాణాన్ని, అవి ఉన్న ఖచ్చితమైన స్థానాన్ని సెకన్ల వ్యవధిలోనే అత్యంత స్పష్టమైన ఇమేజింగ్ ద్వారా స్క్రీన్‌పై వీక్షించవచ్చు. దీనివల్ల కణితి చుట్టూ ఉండే ఇతర ఆరోగ్యకరమైన అవయవాలకు ఎలాంటి నష్టం వాటిల్లదు. కేవలం క్యాన్సర్ కణాలపై మాత్రమే రేడియేషన్ ప్రభావం పడేలా అత్యంత ఖచ్చితత్వంతో చికిత్స అందించవచ్చు."


**డాక్టర్ టి. స్రవంతి, క్యాన్సర్ నిపుణులు**

# మొండికుంట కాలువపై పూర్వపు కల్వర్టునే నిర్మించాలి

- ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం సమర్పించిన బీజేపీ శ్రేణులు
- సర్వే నంబర్లు 174, 175, 176లలో హద్దులు నాటాలని డిమాండ్
- భవిష్యత్తు అవసరాలను పరిగణనలోకి తీసుకోవాలి: కౌన్సిలర్ బుడ్డ సురేష్

**తొలివెలుగు, చౌటుప్పల్:** చౌటుప్పల్ పట్టణంలోని వలిగొండ రోడ్డుపై ప్రవహిస్తున్న మొండికుంట కాలువపై గతంలో ఉన్న కల్వర్టును యథాతథంగా పునర్నిర్మించి, భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా కాలువ విస్తీర్ణాన్ని పరిరక్షించాలని బీజేపీ చౌటుప్పల్ పట్టణ శాఖ నాయకులు, 18వ వార్డు కౌన్సిలర్ బుడ్డ సురేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. అంతకుముందు బీజేపీ నాయకులు వలిగొండ రోడ్డులోని మొండికుంట కాలువ పరిధిలో ఉన్న సర్వే నంబర్లు 174, 175, 176 ప్రాంతాలను సందర్శించి అక్కడ జరుగుతున్న నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడిన కౌన్సిలర్ బుడ్డ సురేష్, పార్టీ నాయకులు కాలువ ఆక్రమణలపై వెంటనే చర్యలు చేపట్టాలని కోరారు. 2020లో మొండికుంట కాలువ స్థలాన్ని ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలను అప్పటి మున్సిపల్ కమిషనర్ రామ్‌దుర్గారెడ్డి, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా అధికారులు స్పందించి అక్రమ నిర్మాణాలను తొలగించారని గుర్తు చేశారు. అదే సమయంలో 35 మీటర్ల పొడవుతో కల్వర్టు, 100 అడుగుల వెడల్పుతో కాలువ నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. అయితే ప్రస్తుతం అదే ప్రాంతంలో మళ్లీ ఆక్రమణలు చోటుచేసుకుంటున్నాయని, గతంలో ప్రతిపాదించిన పరిమాణాలకు విరుద్ధంగా కనీసం 20 మీటర్ల పొడవు కూడా లేని కల్వర్టు నిర్మాణానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. చౌటుప్పల్ పట్టణంలోని 80 శాతానికి పైగా మురుగునీరు, వర్షపు నీరు మొండికుంట కాలువ ద్వారానే ప్రవహిస్తుండటంతో భవిష్యత్తులో నీటి ప్రవాహానికి ఆటంకాలు ఏర్పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కాలువ సహజ స్వరూపాన్ని కాపాడే విధంగా తగిన పొడవు, వెడల్పుతో కల్వర్టు నిర్మాణం చేపట్టాలని, సర్వే నంబర్లు 174, 175, 176 పరిధిలో జరిగిన అక్రమ రిజిస్ట్రేషన్లను రద్దు చేసి వెంటనే రెవెన్యూ సర్వే నిర్వహించాలని కోరారు. అసలు సరిహద్దులను గుర్తించి హద్దురాళ్లు ఏర్పాటు చేసి ఆక్రమణలను పూర్తిగా తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దూడల బిక్షం గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు రామనగోని శంకర్, పెద్దకొండూరు మాజీ సర్పంచ్ కాయితీ రమేష్ గౌడ్, మున్సిపల్ ఉపాధ్యక్షుడు వంగాల రామాకాంత్ గౌడ్, వరగంటి భాను, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి దిండు భాస్కర్ గౌడ్, మండల అధ్యక్షుడు పబ్బు వంశీ, మండల ప్రధాన కార్యదర్శి పబ్బతి శేఖర్, బాతరాజు ప్రవీణ్, పర్నె శ్రీనివాస్ రెడ్డి, కుంభ బాబు, బాపనయ్య తదితరులు పాల్గొన్నారు.



# నవదంపతులకు ఆర్థిక సహాయం అందజేత

- ఆడపడుచు వివాహానికి రూ. 10 వేలు అందజేసిన ఎలిమినేటి జంగారెడ్డి
- ఏజెఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పెళ్లి కానుక

**తొలివెలుగు, వలిగొండ:** పేద కుటుంబాలలోని ఆడపడుచుల వివాహాలకు సామాజిక బాధ్యతగా ఆర్థిక సాయం అందించడం అభినందనీయమని పలువురు కొనియాడారు. వలిగొండ మండలం పహిల్వాన్‌పూర్ గ్రామానికి చెందిన బండారు భారతమ్మ – భద్రయ్య దంపతుల చిన్న కుమార్తె బండారు మనీష వివాహం గురువారం టేకుల సోమారం గ్రామ పరిధిలోని ఉమ్మడి మడిశెట్టి శంకరయ్య (ఎమ్ఎమ్ఎస్) ఫంక్షన్ హాల్‌లో వైభవంగా జరిగింది. ఈ వివాహ వేడుకకు ఏజెఆర్ ఫౌండేషన్ అధినేత ఎలిమినేటి జంగారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కళ్యాణ వేదికపై నూతన వధూవరులను ఆశీర్వదించిన ఆయన.. ఫౌండేషన్ తరఫున పెళ్లి కానుకగా రూ. 10,000 నగదును వధువు తల్లిదండ్రులకు అందజేశారు. పేద కుటుంబాలకు తమ వంతు సాయంగా ఈ ఆర్థిక భారాన్ని పంచుకోవడం సంతోషంగా ఉందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు, యువత, లబ్ధిదారుని కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



# కల్లూరి రామచంద్రారెడ్డి తీరు మార్చుకోవాలి

- స్థాయికి మించి విమర్శలు చేస్తే ప్రజలే తగిన బుద్ధి చెబుతారు
- రాజాపేట మండల కాంగ్రెస్ పార్టీ హెచ్చరిక

**తొలివెలుగు, రాజాపేట:** బీఆర్ఎస్ నాయకుడు కల్లూరి రామచంద్రారెడ్డి తన రాజకీయ వైఖరిని మార్చుకోవాలని, ప్రజా ప్రతినిధులపై నిరాధార విమర్శలు మానుకోవాలని రాజాపేట మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు హెచ్చరించారు. గురువారం రాజాపేట అతిథి గృహంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నమిల మహేందర్ గౌడ్, పార్టీ జిల్లా నాయకులతో కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి కోట్లాది రూపాయల నిధులు తీసుకొచ్చి పలు అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తున్నప్పటికీ, వాటిని గుర్తించకుండా రాజకీయ లబ్ధి కోసం కల్లూరి రామచంద్రారెడ్డి విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. ఆలేరు నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా బీర్ల ఐలయ్య పనిచేస్తున్నారని, ఆయనపై వ్యక్తిగత విమర్శలు చేయడం సరికాదన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కాంగ్రెస్ ప్రభుత్వం పాలన సాగిస్తోందని, రాష్ట్రవ్యాప్తంగా అమలవుతున్న సంక్షేమ పథకాలకు ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తోందని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మరోసారి ప్రజల ఆశీర్వాదాలతో విజయం సాధిస్తుందని, ఆలేరు నియోజకవర్గంలో బీర్ల ఐలయ్య మరింత మెజారిటీతో గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు. రాజకీయ నాయకులు హుందాగా వ్యవహరించాలని, ప్రజా సమస్యలపై చర్చించాలే తప్ప వ్యక్తిగత విమర్శలకు దిగకూడదని సూచించారు. ఈ సమావేశంలో మండల సోషల్ మీడియా కన్వీనర్ జన్న గణేష్, జిల్లా, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



తొలివెలుగు
జాతీయ దిన పత్రిక
మన భాష.. మన పత్రిక..





# ఎస్ఐఆర్ శిక్షణ శిబిరాన్ని సందర్శించిన అదనపు కలెక్టర్

- బీఎల్‌వోలు, సూపర్వైజర్లకు మార్గనిర్దేశం
- ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియను విజయవంతం చేయాలని సూచన

**తొలివెలుగు, రాజాపేట:** ఈ నెల 25 నుంచి ప్రారంభం కానున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమం నేపథ్యంలో రాజాపేటలో బీఎల్‌వోలు, బీఎల్‌వో సూపర్వైజర్లకు నిర్వహిస్తున్న శిక్షణ శిబిరాన్ని యాదాద్రి భువనగిరి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వెంకారెడ్డి గురువారం ఆకస్మికంగా సందర్శించారు. రాజాపేట బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలించిన ఆయన, ఎన్నికల ప్రక్రియలో బీఎల్‌వోల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. ఓటరు జాబితాల సవరణ కార్యక్రమాన్ని పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వల్లపు ప్రదీప్ సమక్షంలో బీఎల్‌వోలకు అవసరమైన కిట్లను పంపిణీ చేశారు. ఎస్ఐఆర్ కార్యక్రమంపై ఏఎల్ఎంసీ ట్రైనర్లు దినేష్ కుమార్, ఉదయ్ కుమార్ శిక్షణ అందించారు. శిక్షణ కార్యక్రమంలో బీఎల్‌వోలు, బీఎల్‌వో సూపర్వైజర్లు, ఏఆర్ఐ నర్సింహులు, ఏఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ రహ్మత్, జూనియర్ అసిస్టెంట్ రాజశేఖర్, జీపీవోలు తదితరులు పాల్గొన్నారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన సూచనలు, అవగాహన కల్పించారు.

# కురుమ సంఘం సభ్యుడి కుటుంబానికి ఆర్థిక సాయం

- రూ.5 వేల సహాయం అందజేసిన గ్రామ శాఖ అధ్యక్షుడు రమేష్
- బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా



**తొలివెలుగు, రాజాపేట:** రాజాపేట మండలం చల్లూరు గ్రామానికి చెందిన కురుమ సంఘం సభ్యుడు దిడ్డిగా కరుణాకర్ మృతి పట్ల కురుమ సంఘం నాయకులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గురువారం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి మనోధైర్యం కల్పించారు. ఈ సందర్భంగా చల్లూరు గ్రామ కురుమ సంఘం శాఖ అధ్యక్షుడు దిడ్డిగా రమేష్ మాట్లాడుతూ.. కరుణాకర్ మృతి సంఘానికి తీరని లోటని అన్నారు. బాధిత కుటుంబానికి సంఘం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం కురుమ సంఘం తరఫున రూ.5 వేల ఆర్థిక సహాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. కష్టకాలంలో బాధిత కుటుంబానికి అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొంటూ, సంఘ సభ్యుల సహకారంతో ఈ ఆర్థిక సాయం అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కురుమ సంఘం ఉపాధ్యక్షుడు మీస కర్ణాకర్, ప్రధాన కార్యదర్శి చేట్కూరి స్వామి, సంఘం సలహాదారు చేట్కూరి కుమార్, కార్యవర్గ సభ్యుడు దిడ్డిగా అనిల్, సంఘం సభ్యులు, కుల పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలల్లో అభ్యాస నైపుణ్యాలు పెంపొందించాలి

- టేకుల సోమవరంలో పాఠశాలలను తనిఖీ చేసిన డీఈఓ బిక్షపతి
- బడిబాటలో ప్రవేశాలు పెంచాలని ఉపాధ్యాయులకు ఆదేశం
- మధ్యాహ్న భోజన నాణ్యత పరిశీలన



**తొలివెలుగు, వలిగొండ:** విద్యార్థుల్లో చదవడం, రాయడం వంటి కనీస అభ్యాస సామర్థ్యాలను మెరుగుపరిచేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) బిక్షపతి అన్నారు. వలిగొండ మండలం టేకుల సోమవారం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను గురువారం ఆయన ఆకస్మికంగా సందర్శించి విద్యా కార్యక్రమాల అమలు తీరును పరిశీలించారు. తరగతి గదులకు వెళ్లిన డీఈఓ.. విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి వారి పఠన, లేఖన నైపుణ్యాలను స్వయంగా పరీక్షించారు. విద్యార్థులు పాఠ్యాంశాలతో పాటు అన్ని రంగాల్లో ముందంజలో ఉండేలా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'బడిబాట' కార్యక్రమంపై ఆయన ప్రధానోపాధ్యాయులతో సమీక్షించారు. గ్రామాల్లో ఉపాధ్యాయులు విస్తృతంగా పర్యటించి, ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న వసతులను వివరించి ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల నమోదు సంఖ్యను గణనీయంగా పెంచాలని ఆదేశించారు. అనంతరం పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన, రుచికరమైన భోజనాన్ని అందించాలని, వంట ఏజెన్సీ నిర్వాహకులు నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. పాఠశాల ఆవరణను, తరగతి గదులను నిరంతరం పరిశుభ్రంగా ఉంచుతూ ఆహ్లాదకరమైన విద్యా వాతావరణాన్ని కల్పించాలని స్పష్టం చేశారు. ఈ తనిఖీలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# ఇంటిపై కూలిన చెట్టు.. త్రుటిలో తప్పిన ముప్పు!

- రామన్నపేటలో ఈదురుగాలి బీభత్సం
- భోజన సమయంలో రేకులు విరిగి లోపల పడ్డ కొమ్మలు
- ప్రభుత్వ సాయం కోసం బాధితుల నిరీక్షణ

**తొలివెలుగు, రామన్నపేట:** మండల కేంద్రంలో బుధవారం రాత్రి వీచిన బలమైన ఈదురుగాలుల బీభత్సానికి ఓ నివాస గృహంపై భారీ వృక్షం కూలిపడింది. స్థానికుల కథనం ప్రకారం.. రామన్నపేట మున్సిపల్ కేంద్రంలోని టీటీడీ కళ్యాణ మండపం ఎదురుగా నివాసముంటున్న గంజి సుగుణమ్మ ఇంటిపై రాత్రి ఒక్కసారిగా చెట్టు కూలిపోయింది. ఈ ప్రమాదంలో ఇంటి పైకప్పు సిమెంట్ రేకులు పూర్తిగా పగిలిపోయి, భారీ కొమ్మలు నివాస గృహం లోపలికి దూసుకువచ్చాయి. ప్రమాదం జరిగిన సమయంలో కుటుంబ సభ్యులంతా ఇంట్లోనే కూర్చుని రాత్రి భోజనం చేస్తున్నారు. పెద్ద శబ్దంతో పైకప్పు రేకులు, చెట్టు కొమ్మలు ఒకేసారి కింద పడటంతో వారంతా తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. ఈ ఘటనలో ఇంట్లోని ఓ చిన్నారికి స్వల్ప గాయాలయ్యాయి. త్రుటిలో పెద్ద ప్రమాదం తప్పడంతో కుటుంబ సభ్యులు, స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. కాగా, చెట్టు కూలడం వల్ల ఇల్లు పూర్తిగా దెబ్బతిని నిలువ నీడ కోల్పోయామని, ప్రభుత్వం స్పందించి తమను ఆర్థికంగా ఆదుకోవాలని ఇంటి యజమానురాలు గంజి సుగుణమ్మ రెవెన్యూ అధికారులను వేడుకున్నారు.





# జరగిటు చూడుండ్రి సారు..!
# యమపురిగా మారిన ఉత్తటూరు రోడ్లు

- గుంతల రహదారులపై ప్రయాణికుల నరకయాతన
- గతంలో నడిచిన బస్సు రోడ్డు బాగాలేక బంద్!
- పట్టించుకోని పాలకులు, అధికారులు: బీఆర్ఎస్ యూత్ నాయకుడు మేడి రాజు

**తొలివెలుగు, రామన్నపేట:** రామన్నపేట మండలం ఉత్తటూరు గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారులు పూర్తిగా దెబ్బతిని ప్రయాణికులకు యమపురిని తలపిస్తున్నాయని బీఆర్ఎస్ యూత్ నాయకుడు మేడి రాజు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం ఉత్తటూరు పరిసర ప్రాంత రహదారుల దుస్థితిని పరిశీలించిన ఆయన పాలకులు, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. గ్రామానికి నలుదిక్కులా ఉన్న రహదారులు గుంతలమయంగా మారి, కంకర రాళ్లు పైకి తేలడంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ముఖ్యంగా చిట్యాల నుంచి ఉత్తటూరు, ఇస్కిళ్ల గ్రామాలకు వెళ్లే మార్గాలు అధ్వాన్నంగా మారాయని పేర్కొన్నారు. ఉత్తటూరు నుంచి పిల్లిగూడెం మీదుగా కక్కిరేణి వరకు రహదారి పూర్తిగా దెబ్బతిందని, అలాగే ఇస్కిళ్ల మీదుగా మునిపంపుల గ్రామంలోని బ్యాంకుకు వెళ్లే ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారని చెప్పారు. ఉత్తటూరు నుంచి మాంద్ర గ్రామానికి వెళ్లే రహదారి కూడా గుంతలతో నిండిపోయి ప్రమాదకరంగా మారిందన్నారు. గతంలో చిట్యాల నుంచి వనిపాకల, ఉత్తటూరు, ఇస్కిళ్ల, కక్కిరేణి గ్రామాల మీదుగా ఉదయం, సాయంత్రం వేళల్లో ఆర్టీసీ బస్సు సర్వీసులు నడిచేవని గుర్తు చేశారు. ప్రస్తుతం రోడ్లు పూర్తిగా దెబ్బతినడంతో బస్సు సర్వీసులు నిలిచిపోయాయని, దీనివల్ల విద్యార్థులు, ఉద్యోగులు, నిత్య ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఉత్తటూరు గ్రామానికి అన్ని వైపులా ఉన్న రహదారులను పునర్నిర్మించాలని, ఆర్టీసీ బస్సు సర్వీసులను పునరుద్ధరించాలని మేడి రాజు డిమాండ్ చేశారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న రహదారుల సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆయన కోరారు.





# అనుమతి లేని ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

- ఎంఈఓ భాస్కర్‌కు ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ నాయకుల వినతి
- ప్రభుత్వ బడుల్లో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్

**తొలివెలుగు, వలిగొండ:** మండల కేంద్రంలో ప్రభుత్వ అనుమతులు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న శ్రీ చైతన్య పాఠశాలపై విద్యాశాఖ అధికారులు తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎల్లంకి మహేష్ డిమాండ్ చేశారు. గురువారం వలిగొండ మండల విద్యాధికారి (ఎంఈఓ) భాస్కర్‌ను కలిసి విద్యార్థి, యువజన సంఘాల నాయకులతో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎల్లంకి మహేష్ మాట్లాడుతూ.. మండలంలోని పలు ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ప్రభుత్వ నిబంధనలను పూర్తిగా బేఖాతరు చేస్తున్నాయని మండిపడ్డారు. పాఠశాలల ఆవరణలోనే పుస్తకాలు, యూనిఫారాలు, ఇతర స్టేషనరీ వస్తువులను విక్రయిస్తూ విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అడ్డగోలుగా ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఫీజుల పేరుతో తల్లిదండ్రులను మానసిక వేధింపులకు గురిచేస్తున్న విద్యాసంస్థలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు వాటిలో తగిన మౌలిక సదుపాయాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ప్రైవేట్ దోపిడీపై అధికారులు స్పందించకుంటే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ మండల అధ్యక్షుడు మారోజు నరసింహాచారి, ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకుడు సూరారం కళ్యాణ్, మండల నాయకుడు బాలగోని మచ్చగిరి తదితరులు పాల్గొన్నారు.




# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి

- లోతుకుంట, నర్సాయిగూడెంలో ఎంపీడీవో జలందర్ రెడ్డి తనిఖీ
- లబ్ధిదారులు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచన
- గడువులోగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం



**తొలివెలుగు, వలిగొండ:** మండలంలోని లోతుకుంట, నర్సాయిగూడెం గ్రామాలలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్ల పురోగతిని మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) జి. జలందర్ రెడ్డి గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. హౌసింగ్ విభాగం డీఈ, ఏఈ, సంబంధిత గ్రామ పంచాయతీ కార్యదర్శులతో కలిసి ఆయన ఆయా గ్రామాల్లో పర్యటించి, లబ్ధిదారుల గృహ నిర్మాణాల శంకుస్థాపనలు, బేస్‌మెంట్ స్థాయి పనులను నిశితంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి పేదవానికి సొంత ఇల్లు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందన్నారు. ప్రస్తుతం గుడిసెల్లో నివసిస్తున్న లబ్ధిదారుల పరిస్థితిని ఆయన ప్రత్యక్షంగా అడిగి తెలుసుకుని, లబ్ధిదారులు ఈ సువర్ణావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గృహ నిర్మాణ పనులను ఎక్కడా ఆలస్యం చేయకుండా తక్షణమే ప్రారంభించి, ప్రభుత్వం నిర్దేశించిన నిర్ణీత గడువులోగా పూర్తి చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఆర్థిక సాయంతో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ శాశ్వత నివాసాలను నిర్మించుకోవాలన్నారు. గృహ నిర్మాణ పనులను నిరంతరం పర్యవేక్షిస్తూ, నిర్దేశిత లక్ష్యాలను సకాలంలో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని హౌసింగ్ అధికారులను, పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో హౌసింగ్ శాఖ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.





# మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా పున్న జగన్‌మోహన్

- పార్టీ బలోపేతానికి సమిష్టిగా కృషి చేయాలి
- ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం



**తొలివెలుగు, రామన్నపేట:** మండల కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన పున్న జగన్ మోహన్‌ను ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అభినందించారు. గురువారం జగన్ మోహన్ ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆయనకు శాలువా కప్పి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ.. మండలంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త సమిష్టిగా శ్రమించాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. నూతనంగా ఎన్నికైన జగన్ మోహన్ నిరంతరం పార్టీ అభివృద్ధికి కృషి చేస్తూ, క్షేత్రస్థాయిలో కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా నిలవాలని ఆకాంక్షించారు. కొత్త బాధ్యతలను సవ్యంగా నిర్వహిస్తూ పార్టీని మరింత ముందుకు నడిపిస్తారనే నమ్మకం తనకు ఉందన్నారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించిన ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు బి. మహేష్ కుమార్ గౌడ్, ఎమ్మెల్యే వేముల వీరేశంలకు నూతన అధ్యక్షుడు పున్న జగన్ మోహన్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

# శాశ్వత ధాన్యం కొనుగోలు కేంద్రానికి భూమి కేటాయించాలి

- చౌటుప్పల్ తహశీల్దార్‌కు దండు మల్కాపూర్ సర్పంచ్ నిరంజన్ గౌడ్ వినతి
- ప్రైవేట్ స్థలాల అద్దె భారంతో ఇబ్బందులు
- సర్వే నంబరు 05లో స్థలాన్ని కేటాయించాలి: సర్పంచ్



**తొలివెలుగు, చౌటుప్పల్:** చౌటుప్పల్ మండలం దండు మల్కాపూర్ గ్రామంలో రైతుల సౌకర్యార్థం శాశ్వత ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయడానికి ప్రభుత్వ భూమి కేటాయించాలని సర్పంచ్, జిల్లా సర్పంచుల ఫోరం జనరల్ సెక్రటరీ గిర్కటి నిరంజన్ గౌడ్ కోరారు. ఈ మేరకు గురువారం ఆయన చౌటుప్పల్ తహశీల్దార్ వీరబాయికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ నిరంజన్ గౌడ్ మాట్లాడుతూ.. గ్రామంలో వడ్ల కొనుగోలు కేంద్రం నిర్వహించేందుకు అనువైన ప్రభుత్వ భూమి అందుబాటులో లేక ప్రతి ఏడాది రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రైవేట్ స్థలాలను అద్దెకు తీసుకుని కేంద్రాలు నిర్వహించాల్సి వస్తోందని, దీనివల్ల గ్రామ పంచాయతీపై అదనపు ఆర్థిక భారం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాల్సిన అవసరం ఉందని, దండు మల్కాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని సర్వే నంబర్ 05లో ఉన్న ప్రభుత్వ భూమిని ధాన్యం కొనుగోలు కేంద్రానికి కేటాయించాలని తహశీల్దార్‌ను కోరినట్లు తెలిపారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని రెవెన్యూ అధికారులు తక్షణమే స్పందించి అవసరమైన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. రైతులకు సౌకర్యవంతంగా కొనుగోలు కేంద్రాలు అందుబాటులో ఉంటే ధాన్యం సేకరణ ప్రక్రియ మరింత సులభతరం అవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

# విద్యార్థుల భద్రతే లక్ష్యం: బీఆర్ఎస్వీ

- గుర్తింపు లేని ప్రైవేట్ పాఠశాలల వివరాలు బహిర్గతం చేయాలని డిమాండ్
- ఫైర్ సేఫ్టీ, భవన భద్రతా ప్రమాణాలపై పూర్తి సమాచారం కోరిన బీఆర్ఎస్వీ విద్యార్థి నాయకులు

**తొలివెలుగు, చౌటుప్పల్:** ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థుల భద్రత, విద్యా ప్రమాణాల పరిరక్షణ, ప్రభుత్వ నిబంధనల అమలుపై పూర్తి పారదర్శకత తీసుకురావడమే తమ లక్ష్యమని బీఆర్ఎస్వీ నాయకులు తెలిపారు. చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రైవేట్ విద్యాసంస్థల అనుమతులు, గుర్తింపు, భద్రతా ప్రమాణాలపై సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) కింద దరఖాస్తు సమర్పించిన సందర్భంగా వారు మాట్లాడారు. బీఆర్ఎస్వీ మునుగోడు నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి ముట్టుకులోజు రాఘవ మాట్లాడుతూ.. పాఠశాలల్లో అగ్నిమాపక భద్రతా ప్రమాణాలు, భవనాల స్థిరత్వం, ప్రభుత్వ గుర్తింపు వంటి అంశాలు విద్యార్థుల ప్రాణాలకు నేరుగా సంబంధించినవని అన్నారు. ఈ విషయాల్లో ఎలాంటి నిర్లక్ష్యం జరిగినా తీవ్ర పరిణామాలు ఎదురయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. గుర్తింపు లేకుండా లేదా నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని, విద్యాశాఖ తనిఖీ నివేదికలు, ఫైర్ సేఫ్టీ సర్టిఫికెట్లు, భవన భద్రతా ధ్రువపత్రాలు వంటి వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. విద్యా రంగంలో పారదర్శకత పెరిగితే తల్లిదండ్రులకు సరైన సమాచారం అందుతుందని, విద్యార్థుల భవిష్యత్తు మరింత భద్రంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ నిబంధనలను కచ్చితంగా అమలు చేయించడం ద్వారా విద్యార్థులకు సురక్షితమైన, నాణ్యమైన విద్యా వాతావరణం కల్పించడమే బీఆర్ఎస్వీ ప్రధాన ఉద్దేశమని నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ కోశాధికారి మొహమ్మద్ ఫరాన్, నాయకులు గంగాదేవి శివ, ఉదారి రాకేష్, అత్తు, జున్ను తదితరులు పాల్గొన్నారు.




# బూత్ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలి





- విజయవంతంగా నిర్వహించిన బీఆర్ఎస్ ఎస్ఐఆర్ కార్యక్రమం
- కార్యకర్తలకు దిశానిర్దేశం చేసిన మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి
- గ్రామ స్థాయి నుంచి పార్టీని పటిష్టం చేయాలని క్యామ మల్లేష్ పిలుపు

**తొలివెలుగు, ఆలేరు:** ఆలేరు నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమం గురువారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్ రెడ్డి, భువనగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ క్యామ మల్లేష్ ముఖ్య అతిథులుగా హాజరై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా క్యామ మల్లేష్ మాట్లాడుతూ.. పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని మరింత బలోపేతం చేయడంలో ఎస్ఐఆర్ కార్యక్రమం కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఉద్యమ స్ఫూర్తితో చేపట్టి ప్రతి గ్రామం, ప్రతి బూత్‌లో పార్టీ బలాన్ని పెంచాలని సూచించారు. బీఆర్ఎస్ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేసే దిశగా కార్యకర్తలు పనిచేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం గతంలో చేపట్టిన కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని, పార్టీ పట్ల ప్రజల్లో మరింత విశ్వాసం పెంపొందించేలా కృషి చేయాలని సూచించారు. గ్రామ స్థాయి నుంచి బూత్ స్థాయి వరకు పార్టీ నిర్మాణాన్ని పటిష్టం చేయడంలో ప్రతి కార్యకర్త బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్ రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ కార్యకర్తలు పార్టీకి వెన్నెముకలాంటివారని కొనియాడారు. ప్రజలతో నిరంతరం మమేకమై వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తూ పార్టీ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. రాజకీయ పరిస్థితులు ఎలా ఉన్నా కార్యకర్తలు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని, రాబోయే రోజుల్లో పార్టీ మరింత బలోపేతం కావడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్ రెడ్డి మాట్లాడుతూ.. ఆలేరు నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని కోరారు. సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేసి పార్టీ విస్తరణకు కృషి చేయాలని సూచించారు. ఈ




కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, మండల, గ్రామ స్థాయి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పార్టీ సంస్థాగత బలోపేతం, సభ్యత్వ నమోదు, ప్రజా సమస్యలపై చేపట్టాల్సిన కార్యాచరణపై విస్తృతంగా చర్చించారు.

# ఓటరు నమోదులో బిఎల్‌వోలకు సహకరించండి

- జూన్ 25 నుంచి ఓటరు ప్రత్యేక నమోదు ప్రక్రియ
- బూత్ స్థాయి అధికారులకు శిక్షణ: ఆర్డీవో శేఖర్ రెడ్డి

**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** ప్రత్యేక ఓటరు నమోదు ప్రక్రియలో భాగంగా ప్రతి ఒక్కరూ బూత్ స్థాయి అధికారులకు (బిఎల్‌వో) సహకరించాలని చౌటుప్పల్ ఆర్డీవో శేఖర్ రెడ్డి కోరారు. గురువారం మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ (గర్ల్స్) పాఠశాలలో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో బిఎల్‌వోలకు 'స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్ (ఎస్ఐఆర్)–2025'పై శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ.. ఈ నెల 25 నుంచి వచ్చే నెల 24 వరకు ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో బిఎల్‌వోలు ప్రతి ఇంటికీ వచ్చి దరఖాస్తు ఫారాలను అందజేస్తారని, వాటిని పూర్తి చేసి నిర్ణీత గడువులోగా తిరిగి వారికి అందజేయాలని సూచించారు. లేనిపక్షంలో ఓటు హక్కు కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఓటు నమోదు ప్రక్రియలో పాల్గొని, తమ హక్కును కాపాడుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీనివాస్ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.



# 20 ఏళ్లుగా మౌలిక వసతులకు నోచుకోని కాలనీ

- మున్సిపల్ చైర్మన్, కమిషనర్‌కు వినతిపత్రం అందజేసిన కాలనీవాసులు
- ఇంటి నంబర్లు, విద్యుత్ దీపాలు, డ్రైనేజీ సమస్యలతో సతమతం



**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** పట్టణంలోని బసవలింగేశ్వర కాలనీలో గత రెండు దశాబ్దాలుగా మౌలిక వసతులు కరువయ్యాయని, పాలకులు పట్టించుకోవడం లేదని కాలనీ అధ్యక్షుడు కొమ్ము లక్ష్మణ్ ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీ కమిటీ ఆధ్వర్యంలో గురువారం వారు మున్సిపల్ కార్యాలయానికి చేరుకుని చైర్మన్ తడక వెంకటేశ్వర్లు, కమిషనర్ అంజన్ కుమార్ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ.. గత 15 ఏళ్లుగా ఇక్కడ నివాసముంటున్నా కనీసం ఇంటి నంబర్లు కూడా కేటాయించలేదని వాపోయారు. వీధి దీపాలు లేక రాత్రివేళల్లో రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నామని, డ్రైనేజీ వ్యవస్థ లేక దోమల బెడద పెరిగి అనారోగ్యాల బారిన పడుతున్నామని తెలిపారు. ఎన్నిసార్లు అధికారులకు మొరపెట్టుకున్నా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు.. కాలనీ సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని, పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ గౌరవాధ్యక్షులు కర్నాటి పురుషోత్తం, సలహాదారులు లక్ష్మీనారాయణ, వేముల ఎలేందర్, గుండు సత్యనారాయణ, వెంకటేష్, నరేందర్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

# ఆయిల్ పామ్ సాగుపై ప్రత్యేక దృష్టి సారించండి

- రైతులకు ఆర్థిక ప్రయోజనాలు వివరించాలి
- ఉద్యాన శాఖ అధికారులకు జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశం
- జూమ్ ద్వారా 2026-27 వార్షిక లక్ష్యాలపై సమీక్ష

**తొలివెలుగు, యాదాద్రిభువనగిరి:** జిల్లాలో ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణాన్ని పెంచేలా వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. పంట మార్పిడిలో భాగంగా రైతులను ఆయిల్ పామ్ సాగు వైపు మళ్లించేలా ప్రోత్సహించాలని సూచించారు. గురువారం ఆయన ఉద్యాన శాఖ అధికారులతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2026–27) పథకాలు, నిర్దేశిత లక్ష్యాలపై జూమ్ మీటింగ్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సంప్రదాయ పంటల స్థానంలో ఆయిల్ పామ్ సాగు చేపట్టడం వల్ల కలిగే ఆర్థిక ప్రయోజనాలను క్షేత్రస్థాయిలో రైతులకు సవివరంగా తెలియజేయాలన్నారు. ఈ పంటకు కోతులు, అడవి పందుల బెడద ఉండదని స్పష్టం చేశారు. రైతులు ఆయిల్ పామ్ మొక్కలు నాటిన నాలుగవ ఏడాది నుంచి కాపు మొదలవుతుందని, అక్కడి నుంచి సుమారు 30 ఏళ్ల పాటు నిరంతరాయంగా ఆదాయం పొందవచ్చని వివరించారు. ఈ పంటకు మార్కెటింగ్ సమస్య లేదని, ప్రభుత్వం కేటాయించిన కంపెనీల ద్వారా రవాణా, ప్రాసెసింగ్ సౌకర్యాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. సగటున ఎకరానికి 10 నుంచి 12 టన్నుల దిగుబడి వస్తుందని, తద్వారా రైతులకు ఏడాదికి సుమారు రూ. 1,20,000 నుంచి రూ. 1,50,000 వరకు నికర ఆదాయం లభిస్తుందన్నారు. ప్రభుత్వ ప్రోత్సాహకాలను అందిపుచ్చుకుని రైతులు ఈ సాగును చేపట్టేలా అవగాహన కల్పించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లా ఉద్యాన శాఖ అధికారి కె. హేమలత, ఇతర ఉద్యాన అధికారులు పాల్గొన్నారు.



# న్యాయవాదులందరికీ హెల్త్ కార్డులు జారీ చేయాలి

- జూన్ 20న ఇందిరాపార్క్ వద్ద 'ఐలు' ఆధ్వర్యంలో ధర్నా
- రామన్నపేటలో కరపత్రాల విడుదల
- ఆరోగ్య బీమా పరిధిని పెంచాలని డిమాండ్

**తొలివెలుగు, రామన్నపేట:** తెలంగాణ రాష్ట్రంలో బార్ కౌన్సిల్‌లో నమోదు చేసుకున్న న్యాయవాదులందరికీ మెడికల్ ఇన్సూరెన్స్, హెల్త్ కార్డులు తక్షణమే జారీ చేయాలని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) రాష్ట్ర ఉపాధ్యక్షుడు మామిడి వెంకటరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. న్యాయవాదుల డిమాండ్ల సాధనకై జూన్ 20న హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద నిర్వహించనున్న మహాధర్నాకు సంబంధించిన కరపత్రాన్ని గురువారం రామన్నపేట బార్ అసోసియేషన్ హాల్‌లో ఆవిష్కరించారు. అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎండీ. మజీద్, యాదాసు యాదయ్యులు ఈ కరపత్రాన్ని విడుదల చేశారు.ఈ సందర్భంగా మామిడి వెంకటరెడ్డి మాట్లాడుతూ.. 2019 సంవత్సరం తర్వాత ఎన్‌రోల్ చేసుకున్న వేలాది మంది యువ న్యాయవాదులకు ఇప్పటివరకు హెల్త్ కార్డుల ప్రయోజనం కల్పించకపోవడం విచారకరమన్నారు. ప్రతి న్యాయవాదితో పాటు వారి కుటుంబ సభ్యులకు పూర్తి ఆరోగ్య భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఆరోగ్య బీమా పరిమితిని పెంచడంతో పాటు, తల్లిదండ్రులను కూడా ఈ పరిధిలోకి తీసుకురావాలని, కార్పొరేట్ ఆసుపత్రులను మరిన్నింటిని ఎంపానెల్ చేయాలని కోరారు. అడ్వకేట్స్ వెల్ఫేర్ ట్రస్ట్‌కు అదనపు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. జూన్ 20న జరిగే ధర్నాను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సంగిశెట్టి బాలరాజు, కునూరు శ్రీనివాస్, నోముల స్వామి, జెల్లా రమేష్, గడ్డం నరసింహ, గాలి సుదర్శన్, శంకర్, అంకం నరేష్ తదితరులు పాల్గొన్నారు.



తొలివెలుగు
జాతీయ దిన పత్రిక
మన భాష.. మన పత్రిక..



భారతీయులు ఎవరినైనా ప్రేమిస్తే గుండెల్లో స్థానం ఇస్తారు. ఆ ప్రేమ పెరిగిపోతే గుడి కూడా కట్టేస్తారు. ఇప్పుడు యువభారత్లో సంచలన ఆటగాడు వైభవ్ సూర్య వంశీ కి అభిమానులు కచ్చితంగా గుడి కడతారు. ఇందులో ఏమాత్రం అనుమానం లేదు..ఐపీఎల్ లో ఆడుతున్నప్పుడు రాజస్థాన్ జట్టు తరుపున సెంచరీ చేశాడు వైభవ్ సూర్య వంశీ. కేవలం 14 సంవత్సరాలు దాటని వయసులో అతడు ఆ ఘనత అందుకున్నాడు. ప్రపంచ స్థాయి మేటి బౌలర్లను ఓడించి సత్తా చూపించాడు. తద్వారా తను ఎంత ప్రమాదకరమైన ఆటగాడినో నిరూపించాడు.



# ఈ బుడ్డోడు.. ఫ్యూచర్ భారత్

వైభవ్ సూర్య వంశి. అతడికి ఇంకా నూనూగు మీసాలు కూడా రాలేదు. తన తోటి పిల్లలు పాఠశాలల్లో పుస్తకాలతో కుస్తీ పడుతుంటే.. ఇతడేమో బ్యాట్ చేత పట్టుకొని ఆడుతున్నాడు. పాఠశాలలకు బదులుగా నెట్స్ లో తీవ్రంగా సాధన చేస్తున్నాడు. టోర్నీల పేరుతో దేశ విదేశాలు తిరుగుతున్నాడు. అతడు ఇప్పుడు ఏకంగా భారత జట్టుకు భవిష్యత్తు ఆశాకిరణం మాదిరిగా కనిపిస్తున్నాడు.ఇంగ్లాండ్ జట్టుతో జరిగిన అండర్ 19 వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్ లో వైభవ్ సూర్య వంశీ 175 పరుగులు చేశాడు. టీం ఇండియాను విజేతగా నిలిపాడు. అయితే ఇంతటితోనే వైభవ్ సూర్య వంశీ ఆగిపోలేదు. అనేక రికార్డులను బద్దలు కొట్టాడు. ముఖ్యంగా పాకిస్తాన్ క్రికెటర్ బాబర్ ఆజామ్ సాధించిన ఘనతను జస్ట్ పక్కన పెట్టాడు. విధ్వంసానికి పరాకాష్టగా బ్యాటింగ్ చేసి సరికొత్త చరిత్ర సృష్టించాడు.వైభవ్ సూర్య వంశీ 175 పరుగులు చేయడం ద్వారా అనేక రికార్డులను తన ఖాతాలో వేసుకున్నాడు. అండర్ 19 వరల్డ్ కప్ ప్లే ఆఫ్ లో తొలిసారి 150o పరుగులు చేసిన ఆటగాడిగా వైభవ్ సూర్య వంశీ నిలిచాడు. 2014లో దుబాయ్ లో జరిగిన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ లో ఆస్ట్రేలియాపై వెస్టిండీస్ ఆటగాడు నికోలస్ పూరన్ 143 పరుగులు చేశాడు. 2012లో జరిగిన ఫైనల్ మ్యాచ్లో ఆస్ట్రేలియా పై భారత ఆటగాడు ఉన్ముక్త్ 111లి పరుగులు చేశాడు. 2002 లో ఇంగ్లాండ్ జట్టుపై అంబటి రాయుడు 177లి పరుగుల తర్వాత యూత్ వన్డేలో వైభవ్ సూర్య వంశీ చేసిన 175 పరుగులు.. సెకండ్ హైయెస్ట్ స్కోర్ గా కొనసాగుతున్నాయి. గత ఏడాది డిసెంబర్లో దుబాయ్ లోని యూఏఈ జట్టుపై సూర్యవంశీ 171 పరుగులు చేశాడు. తద్వారా ఈ జాబితాలో రెండు, మూడు స్థానాలలో అతడు కొనసాగుతున్నాడు..వైభవ్ సూర్య వంశీ వయసు ప్రస్తుతం 14 సంవత్సరాల 316 రోజులు. అండర్ ప్రపంచ కప్ లో ఫైనల్ మ్యాచ్లో సెంచరీ చేసిన అతి తక్కువ వయసున్న ఆటగాడు గతంలో ఈ రికార్డు పాకిస్తాన్ ఆటగాడు బాబర్ అజామ్ పేరు మీద ఉండేది. 2010లో వెస్టిండీస్ జట్టుపై 15 సంవత్సరాల 92 రోజుల్లో అతడి సెంచరీ చేశాడు. సూర్య వంశీ (4), నజ్ముల్(1) మాత్రమే 15 సంవత్సరాలు నిండకముందు యూత్ వన్డేలలో సెంచరీలు సాధించారు.గత ఏడాది డిసెంబర్లో విజయ్ హజారే ట్రోఫీలో అరుణాచల్ ప్రదేశ్ జట్టుపై జరిగిన మ్యాచ్లో వైభవ్ సూర్య వంశీ 14 సంవత్సరాల 272 రోజుల వయసులో సెంచరీ చేశాడు.వైభవ్ సూర్య వంశీ 55 బంతుల్లో సెంచరీ చేశాడు. అయితే ఇతర కంటే ముందు విల్ మలాజ్ జుక్ అనే ఆస్ట్రేలియా క్రీడాకారుడు ఈ ఏడాది జరిగిన మ్యాచ్లో జపాన్ మీద 51 బంతుల్లో హాఫ్ సెంచరీ చేశాడు. పాకిస్తాన్ ఆటగాడు కాసిం అక్రమ్ శ్రీలంక మీద 63 బంతుల్లో సెంచరీ చేశాడు. బెన్ మేయెస్ అనే ఇంగ్లాండ్ ఆటగాడు స్కాట్లాండ్ మీద ప్రస్తుత అండర్ 19 వరల్డ్ కప్ లో 65 బంతుల్లో సెంచరీ చేశాడు. భారతదేశానికి చెందిన రాజ్ బవా అనే ఆటగాడు 2022లో ఉగాండా జట్టుపై 69 బంతుల్లో సెంచరీ చేశాడు.



# కిరాణా షాపులో మద్యం విక్రయం.. ఇద్దరిపై కేసు

- దేవలమ్మ నాగారంలో స్వాధీనం చేసుకున్న పోలీసులు

**తొలివెలుగు, చౌటుప్పల్:** కిరాణా షాపులో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్.కృష్ణమాల్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. చౌటుప్పల్ ఇన్స్పెక్టర్ జి.మన్మథ కుమార్ ఆదేశాల మేరకు దేవలమ్మ నాగారం గ్రామంలో గురువారం పోలీసులు తనిఖీలు చేపట్టారు. గ్రామానికి చెందిన ఎస్.కె.హాజరత్ (48) తన కిరాణా షాపులో అనుమతి లేకుండా మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు దాడి చేశారు. ఆ సమయంలో షాపులో అమ్మకాలు జరుపుతున్న ఆయన భార్య సైదాబీని పట్టుకున్నారు. షాపులో నిల్వ ఉంచిన 9 ఆర్సీ బీర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. వైన్ షాపు నుంచి కొనుగోలు చేసి, షాపులో అధిక ధరకు విక్రయిస్తున్నట్లు గుర్తించామని, వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై పేర్కొన్నారు.

# ఉరివేసుకుని యువకుడి ఆత్మహత్య

**- చౌటుప్పల్లో ఘటన.. కేసు నమోదు**

తొలివెలుగు, చౌటుప్పల్: ఆత్మహత్యకు పాల్పడి ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడిన ఘటన చౌటుప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్స్పెక్టర్ జి.మన్మథ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. నేపాల్ దేశానికి చెందిన ఉమేష్ (20) బతుకుదెరువు కోసం చౌటుప్పల్కు వచ్చి చిన్న కొండూరులోని ఓ ఫాస్ట్ ఫుడ్ సెంటర్లో వంట పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఏడాది క్రితమే అతనికి వివాహం కాగా, అతని భార్య నేపాల్లోనే ఆత్మహత్య చేసుకుంది. భార్య మరణం తర్వాత మనస్తాపానికి గురైన ఉమేష్, చౌటుప్పల్కు వచ్చి ఉంటున్నాడు. ఈ క్రమంలో బుధవారం రాత్రి 9:45 గంటల సమయంలో పని ముగించుకుని తన గదికి వెళ్లాడు. రాత్రి 11 గంటల సమయంలో గది బయట లైట్ వెలుగుతుండటాన్ని గమనించిన ఇంటి యజమాని చిలువేరు శివకుమార్, దాన్ని ఆర్పేందుకు లోపలికి వెళ్లగా, ఉమేష్ సీలింగ్కు చీరతో ఉరివేసుకుని విగతజీవిగా వేలాడుతూ కనిపించాడు. వెంటనే స్థానికుల సాయంతో అతడిని చౌటుప్పల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుని సోదరుడు హిరువోడ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మన్మథ కుమార్ తెలిపారు.



పార్లమెంట్ సమావేశాలు గాడి తప్పాయి. సభలో చర్చలకు ఆస్కారం లేదు. రూల్స్ పాటించడం లేదు. అటు ప్రభుత్వం, ఇటు విపక్షం రెండు పక్షాలు కూడా పంతాలకు పోతూ ప్రజాధనాన్ని, సమయాన్ని వృధా చేస్తున్నాయి. పోడియంలోకి దూసుకుని రావడం, అరవడం, కేకలు పెట్టటం సభనుంచి వెళ్లిపోవడం ఏ రకమైన ప్రజాస్వామ్యమో కాంగ్రెస్ చెప్పాలి. గత మూడు రోజులుగా ఇదే తంతు సాగుతోంది. గతంలో లాగానే ఈ బడ్జెట్ సమావేశాల్లో కూడా ఇది కనిపిస్తోంది. సమస్యలను చర్చించడానికి ఉన్న పద్దతులను వదిలేసి కాంగ్రెస్ సభాస్తంభన అస్త్రాన్ని ఉపయోగించుకుంటోంది.



# గాడితప్పతున్న పార్లమెంట్ సమావేశాలు!

కేవలం సభా కార్యక్రమాలకు అవరోధం లేదా, అంతరాయం కల్పించడం ద్వారా సభా కార్యక్రమాలు సాగకుండా చేస్తోంది. గతంలో అనేక సందర్భాల్లో ఇదే పద్ధతిని అవలంబించింది. సాధారణంగా బడ్జెట్ సమావేశాల్లో రాష్ట్రపతి ప్రసంగంపై చర్చ, ఆ తరవాత బడ్జెట్పై చర్చలు ప్రధానంగా ఉంటాయి. ఈ సందర్భంగా ఏదేని అంశాన్ని చర్చించే అవకాశం ఉంటుంది. కానీ కాంగ్రెస్ చర్చ కోరుకోవడం లేదు. కేవలం రచ్చనే కోరుకుంటోంది. దీంతో ప్రచారం వస్తుందన్న ధీమాలో ఉంది. ఇకపోతే ప్రధానంగా మాజీ ఆర్మీ చీఫ్ నరవణె పుస్తకం ఆధారంగా చైనా సరిహద్దుల్లో పరిస్థితులు, అమెరికాతో ఒప్పందం పైనా చర్చించాలని రాహుల్ లేదా కాంగ్రెస్ కోరుకుం టోంది. అయితే దీనికి కొన్ని రూల్స్ ఉన్నాయి. ఈ మేరకు చర్చకు ప్రతిపాదించి, చర్చ చేయవచ్చు. ఇకపోతే అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై ప్రభుత్వం ప్రకటన చేయకముందే కాంగ్రెస్ యాగీ చేస్తోంది. ఇంతకాలం ట్రేడ్ డీల్ జరగనందుకు మోడీపై దుమ్మెత్తి పోసారు. మన సమస్యలపై పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పుడు ట్రేడ్ డీల్ కుదరగానే అదేదో ద్రోహం జరిగినట్లుగా లేదా మోడీ అమెరికాకు అమ్ముడు పోయినట్లుగా ఆరోపిస్తున్నారు. పార్లమెంటులో ప్రభుత్వం ప్రకటనకు సిద్దంగా ఉన్న సమయంలోనే సమావేశాల్లో రచ్చ చేయడం కాంగ్రెస్÷–కే చెల్లింది. అమెరికా –భారత్ మధ్య వాణిజ్య ఒప్పందం జరిగిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంపోస్షల్ మీడియాలో ప్రకటించటం, ఆ తరువాత మన ప్రధాని మోడీ అవునన్నట్టుగా ట్రంప్నకు ధన్యవాదాలు చెప్పుకోవటం జరిగింది. భారతదేశ ఆత్మగౌరవాన్ని, ఆర్థిక ప్రయోజనాలను పరిరక్షించేదిగా ఉన్నదీ లేనిదీ చర్చిస్తే తెలుస్తుంది. ఏకపక్షంగా అదనపు సుంకాలు విధించటం దగ్గర నుంచి మన ఆర్థిక వ్యవస్థను అవహేళన చేయటం దాకా ట్రంపు సాగించిన బెదిరింపులపై భారత్ ఓపిక పట్టింది. యూరోపియన్ యూరియన్తో ఒప్పందం కుదరగానే ఇప్పుడు ట్రంప్ దిగివచ్చారు. అయితే దీనిని సానుకూలంగా చూడాల్సి విపక్షాలు ప్రభుత్వం లొంగిపోయిందని విమర్శలకు దిగడం ఎంతవరకు సమంజసమో సమాధానం చెప్పాల్సిందే! దేశ అవసరాలను బట్టి, అవకాశాలను బట్టి మనం వివిధ దేశాలతో వాణిజ్య ఒప్పందాలు చేసుకోవటం సాధారణ విసయం. కాంగ్రెస్ అధికారంలో ఉన్నా ఇదే చేస్తుంది. నిజానికి అహంకారపూరితంగా అమెరికా అధ్యక్షుడు బెదిరింపు ధోరణితో వ్యవహరించారు. మన దేశం చౌకగా రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తుంటే–వద్దని అడ్డం పడ్డాది. మన దేశ రైతాంగాన్ని దారుణంగా దెబ్బ తీసేవిధంగా తన వ్యవసాయోత్పత్తులను దిగుమతి చేసుకోవాలని ఒత్తిడి తెచ్చారు. మనం ఏయే దేశాలతో వాణిజ్య సంబంధాలను కలిగి ఉండాలో, కూడదో అదే నిర్దేశించాలని చూశారు. . ఇలాంటి తలబిరుసు పెత్తనానికి భారత్ ఎట్టి పరిస్థితుల్లోనూ తలవొంచకూడదని నిర్ణయించి, ఇంతకాలం ట్రేడ్ డీల్ను పక్కన పెట్టింది. పాకిస్తాన్–ఇండియా యుద్దాన్ని తానే ఆపానని ట్రంప్ అనేకసార్లు ప్రకటించుకున్నా, భారత్పై సుంకాలను భారీగా విధించినా, అక్రమ వలసల పేరిట భారతీయులకు సంకెళ్లు వేసి, దేశంలో దించిపోయినా– భారత్ ఓపిక పట్టింది. ఇప్పుడు కూడా ట్రంప్ ప్రకటించేదాకా ఒప్పందంపై మనం ముందుకు రాలేదు. అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ రెండోసారి ఎన్నికయ్యాక–తన దారిలోకి రాని దేశాలపై ఎడాపెడా సుంకాలు విధించటం ఒక వ్యూహంగా ఎంచుకున్నాడు. కెనడా, బ్రిటన్, దక్షిణ కొరియా వంటి మిత్రదేశాలపైనా, రష్యా, చైనా వంటి పోటీ దేశాలపైనా విరుచుకుపడ్డాడు. సుంకాల విధింపుతో ఆయా దేశాల వాణిజ్యానికి తాత్కాలికంగా నష్టం కలిగించారు. అయితే ధరలు పెరిగి అమెరికా పౌరులకు కూడా అంతే సమస్య ఎదురవుతుంది. దీంతో, ట్రంప్ దూకుడుకు వ్యతిరేకంగా అమెరికాలోనూ పెద్దఎత్తున నిరసనలు వ్యక్తమయ్యాయి. సుంకాలు ఎదుర్కొన్న అనేక దేశాలు సైతం అదే పద్ధతిలో సమాధానం చెప్పాయి. నీకు మేమంత దూరమో మాకు నువ్వూ అంతే దూరం అని సమాధానం ఇచ్చాయి. భారత్ కూడా అదే పద్దతిని అవలంబించింది. మోడీ ప్రభుత్వం ఏ మాత్రం లొంగుబాటుకు ఒప్పుకోలేదు. మనపట్ల అమెరికాలోనే సానుకూలత వ్యక్తం అయ్యింది. అమెరికాలో ఒత్తిడి తట్టుకోలేక ట్రంప్ భారత్తో ఓ రకంగా కాళ్ళ బేరానికి వచ్చాడని చెప్పుకోవాలి. అంతేగానీ భారత్ పరువు పోయిందని, మోడీ లొంగిపోయాడని విమర్శించే వారికి అంతర్జాతీయ వ్యవహారాలు తెలియవను కోవాలి. ఈ విషయంలో కాంగ్రెస్, కమ్యూనిస్టులు ముందున్నారు. ట్రంప్ బెదిరింపులకు లొగివుంటే ఎప్పుడో ఒప్పందం ఖరారు అయ్యేది. అయితే ఇవన్నీ చర్చించాల్సిన అంశాలే. కాదని ఎవరూ అనడం లేదు. పార్లమెంటులో చర్చకు ముందే గలాభా సృష్టించడం ద్వారా కాంగ్రెస్ రాజకీయ పైత్యాన్ని చాటుకుంది. మోడీ ప్రకటన చేసే వరకు ఆగాలి. తాము కోరుకున్నట్లు ఇప్పుడే..ఈ క్షణమే చర్చ జరగాలని అనుకోవడం దుర్మార్గం తప్ప మరోటి కాదు.